# దేవత

దూరాన గుళ్ళో గంటలు గణగణ మోగుతున్నాయి. చలి విదిలించి కొడుతోంది. ప్రయివేటు ముగించుకుని పిల్లలు లాంతర్లు పట్టుకుని గజగజ లాడుతూ యిళ్ళకు వెళుతున్నారు. యలమంద గానుగెద్దు మొండికేసి తిరగటం మానేసింది. బండీవారి వీధిలో 'పార్వతీ కళ్యాణం' హరికథ అక్కడకూడ వినిపిస్తోంది.

జ్యోతి ఒక్కతే వీధి అరుగుమీద కూర్చుని ఆకాశంవంకా భూమి వంకా చూస్తోంది. అంతా తెల్లగా కనిపిస్తోంది. వెన్నెల వెలుగులో ఎదురింటి పెంకులమీద గుమ్మడికాయలు తళతళా మెరుస్తున్నాయి. జ్యో వాటివైపుకే వింతగా చూస్తూ యేవేవో కోర్కెలు పెంచుకుంటోంది. పమిటకొంగును వళ్ళంతా కప్పేసుకుని గువ్వలాగ కూర్చుంది, కదలక మెదలక. చప్పున చీమేదో కుట్టినట్టుంది. చివాలున ఉలిక్కిపడింది. చేతులు విదిలించింది. అరుగు గచ్చు చల్లగా తగిలి వళ్ళు పులకరించింది. మొహమంతా చల్లబడింది. పెదిమలు చలికి నల్లబారినాయి. బుగ్గలు గరుకు తేలినాయి. పైన యెంత చల్లగావున్నా, ఆమె శరీరంలో వేడిమంటలు ఆవిర్లు

తేలుతున్నాయి. వీథిలో వెళ్ళే జనంకూడా తగ్గిపోతున్నారు. రాత్రి పొలం వెళ్ళి పడుకునే నాంచారయ్యకూడా తలగుడ్డ చుట్టుకుని గొంగళి కప్పుకుని చేతికర్రను నేలమీద కొడుతూ భవ్ భవ్ మనే కుక్కల్ని బెదిరిస్తూ చకచక నడిచి వెళ్ళిపోతున్నాడు. సర్కారువారి ఆఫీసులో పదిగంటలు కొట్టేశారు. అయినా సుందరం యింకా రాలేదు. ఇవ్వాళ జ్యోతి మరీను మొండికేసి ఆ అరుగుమీదే వణుకుతూ కూర్చుంది. ఇంత ఆలస్యంగా యింటికి రావటాన్ని సహించలేక పోతోంది. ఏమైనాసరే యివ్వాళ ఖచ్చితంగా అడిగితీరాల్సిందే అనే పట్టుదలతోనే కూర్చుంది. మనస్సు విలవిలలాడి పోతోంది. ఉక్రోషం పెరిగిపోతోంది. ఇహ మిగిలింది కళ్ళనీళ్ళే! అవి కూడా వచ్చేసేవే కాని యింతలో సుందరం దూరాన వస్తున్నట్టు గమనించింది. తన కోపం, ఆవేదన యిట్టే యెగిరిపోయినాయి. మొహం విప్పారింది. కళ్ళు విప్పుకుని ఆయనవంకే అదేపనిగా చూస్తోంది. చూస్తూ చూస్తుండగానే సుందరం లోపలికి రానే వచ్చేశాడు. ఆవేశంగా అమాంతం దగ్గరకు వెళ్ళి చుట్టేసింది. ఇద్దరూ క్షణంలో లోపలికి వెళ్ళిపోయారు. ఆయన హృదయం మీద తలవాల్చి పరవశురాలయి పోయింది. బిడియంతో కళ్ళు గట్టిగా మూసుకుంది. అరచేతుల్తో మొహాన్ని కప్పుకుంది. కళ్ళు తెరుస్తూ మూస్తూ వేళ్ళ సందుల్లోంచి కొంటెగా భర్త మొహంలోకి చూస్తోంది. సిగ్గులో పూర్తిగా మునిగిపోయింది. భార్య వాలకం గమనించిన సుందరం ఆమె ధోరణిని తెలుసుకోనట్లుగా పరధ్యానంగా వుండిపోయాడు. కాని జ్యోతి మనస్సెటెటో పోతోంది. మత్తుగావున్న కళ్ళతో భర్త మొహంలోకి చూస్తూ తన ఆవేశాన్ని వ్యక్తం చెయ్యటానికి తపన పడుతోంది. ఏవేమిటో వినిపించకుండా అంటోంది. ఆయన ఊం ఊ అంటూ భార్య మొహంలోకి బలవంతంగా తెచ్చుకున్న చిరునవ్వుతో క్షణంచూసి మళ్ళీ తల అటువైపుకు తిప్పేసుకున్నాడు. ఆమె ఉద్రేకం ఆవేశం హెచ్చి

పోతున్నాయి. శరీరం మెలికలు తిరుగుతోంది. ఆమె చేతుల్ని అతి నాజూకుగా విడిచేసి తాను కొంచెం ముందుకు వెళ్ళటానికి ప్రయత్నం చేస్తున్నాడేగాని ఆమె పట్టును పూర్తిగా సడలించలేక పోతున్నాడు. మొహం కురచచేసుకుని అటూ యిటూ చూస్తూ గభాలున విదిలించుకుని 'అబ్బాయేడీ!' అంటూ గంభీరంగా అడిగాడు.

ఆమె చివాలున యివతలకొచ్చి బుసలుకొడుతూ నిలబడింది.

'అబ్బాయి రాలేదా యింకా,' మళ్ళీ రెట్టించాడు.

'ఏమో నాకు తెలీదు...'విసురుగా గదిలోకి వెళ్ళిపోయింది.

అంత కోపంగా భార్య సమాధానం చెప్పటం ఆయనకు సుతరాం యిష్టంలేదు. ఇంకా యేవిషయంలోనైనా కోపంగా మాట్లాడినా సహిస్తాడేమోకాని తన కొడుకు విషయంలో అట్లా మాట్లాడటం ఆయన కిష్టం లేదు. కాని ఆ సమయాన ఏమీ అనలేదు. అనలేకపోయాడు కూడా. తెగ ఆరాటపడ్డాడు. ఒకవైపు భార్య ఆరాటంచూసి, మరొకవైపు కొడుకు ప్రవర్తన చూసి.

ఆవేశం అణుచుకుంటూ మెల్లిగా గదిలోకి వెళ్ళి 'జ్యోతీ' అని పిలిచాడు.

రుసరుసలాడుతూ చరచర మంచంమీది దొర్లింది. చల్లగా మూలుగు లాంటి ధ్వనికూడా వినిపించింది.

'ఎట్లా వుందేమిటి!...'

'నా కెట్లా వుంటే మీకేం!...' కళ్ళెర్రచేసి చూసింది. పెదిమలు అనురుతున్నాయి, దుఃఖము పొర్లుకొస్తోంది. ఉక్రోషం హద్దులు మీరుతోంది. దిండును సాగదీసి మడిచి మడత పెడుతోంది. సుందరం పెద్దగా నిట్టూరుస్తూ చూసీచూడకుండా వెనక్కు తిరిగాడు.

'ఎక్కడికి వెళ్ళుంటాడబ్బా యింత రాత్రయినా యింటికి రాలేదే మరి' తనలో తాను సణుక్కుంటున్నాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

జ్యోతికి యిలాంటి అనుభూతి అప్పుడప్పుడు కలుగుతూనే వుంటుంది. కాసేపటికల్లా తనలోతాను సమాధానపడుతుంది. తన పెళ్ళి యేవిధంగా అయిందీ గుర్తుకు తెచ్చుకుని తమాయించుకుంటుంది. కాపరానికి వచ్చిన కొత్తల్లో తన భర్త వయస్సును గురించిన ఆందోళన క్రమక్రమంగా తగ్గిపోయింది. ఆమెను సుఖపెట్టాలని ఆమె మనస్సులో తన వయస్సును గురించిన ఆలోచన రానీయకుండా వుండాలనే సుందరం కూడా బాగానే తాపత్రయ పడ్డాడు. ఇద్దరిలోనూ తలొక విధమైన తాత్కాలిక ఉద్రేకాలు కల్గినా తాపీగా మళ్ళీ సర్దుబాటు చేసుకుంటూనే వున్నారు.

కాని జ్యోతికి మాత్రం అర్థం కాని విషయం ఒకటి వుంది. అది సుందరం కొడుకు విషయం. రాత్రిళ్ళు యిష్టం వచ్చినట్టు వస్తూ వుంటాడు. యించుమించు తన వయస్సు గల అబ్బాయిని ఎట్లా అజమాయిషీ చెయ్యటమా అని బాధపడుతూ వుంటుంది. అతని ముందు జ్యోతి ఆరిందాలాగ నిలబడగల స్తోమత లేదు. అదీగాక ఆ అబ్బాయిని దగ్గరగా చూస్తేచాలు ఆమెకు వణుకు పుట్టుకొస్తుంది. 'తల్లి' అనే భావన అతనిలోనూ కలగలేదు. ఎంతో ముక్తసరిగానూ ముభావంగానూ వుంటాడు.

మంచంమీద అటూయిటూ వత్తిగిలుతూ తపనపడి పోతోంది. ఆయాసం, దడ యెక్కువవుతున్నాయి. చప్పున వీధితలుపు దబదబ చప్పుడయింది. జ్యోతి అప్రయత్నంగా 'ఎవరూ' అన్నది కొంచెం బిగ్గరగానే.

'నేనే వాసును' స్పష్టంగా వినపడింది.

ఆమె గుండె ఝల్లుమంది. ఒక్కసారి ఉలిక్కిపడింది. చప్పున

దుప్పటితీసి వళ్ళంతా కప్పేసుకుని ముసుగు పెట్టుకుని పడుకుంది. సుందరం తలుపుతీసినట్టు చప్పుడు వినపడింది. మరింత భయమేసింది. కళ్ళు గట్టిగా మూసుకుని ఏమేమిటో ఊహించుకుంటూ నిద్రపోవటానికి ప్రయత్నం చేసింది. కాసేపటికల్లా తనకు తెలియకుండానే కళ్ళు కూరు కొస్తున్నాయి. ఒళ్ళు మరిచి గాఢంగా నిద్రపోయింది.

## 2

ఆ యింట్లో ముగ్గురున్నప్పటికీ ఎవరికి వారు ఒంటరిగా వున్నట్టే ప్రవర్తిస్తూ వుంటారు. మనస్సు విప్పి ఒకరితో ఒకరు మాట్లాడుతున్నట్టే కనిపించదు. ఎబ్బెట్టుగానూ బెరుకుగాను వుండిపోతారు. ఏదో కానరాని బాధపడుతున్నట్టుగా ప్రవర్తిస్తారు. అయితే జ్యోతి చప్పున తనలో తాను సమాధానపడి చనువుగా వుండటానికి ప్రయత్నం చేస్తుంది. కాని వాసుగాని భర్తగాని ఆమెను అర్థం చేసుకున్నట్టు కనిపించదు.

ఆనాడు తన చెల్లెలు సరోజిని తనింటికి వచ్చింది. ఉద్యోగం ప్రయత్నంకోసం వస్తానంటే రమ్మనమని తాను, తన భర్త ఉత్తరం రాశారు. తీరా వస్తోందనేటప్పటికి జ్యోతికి అదురు, గుండెదడ ప్రారంభ మయినాయి. వింతగానూ విపరీతంగానూ ఆలోచించుకుంటూ మనస్తాపం పెంచుకుంటోంది. ఎందుకు యింత ఆరాటం అని తనలో తాను ప్రశ్న యిస్తోంది. ఎంత అదుపులో పెడదామనుకున్నా మనస్సు పరిపరివిధాల పోతోంది. "బండీ టైమయింది నే వెళ్ళొస్తా" అని సుందరం అనేటప్పటికి యిట్టే త్రుళ్ళి పడింది.

ఆఁ... వెళ్ళిరండి అన్నది మెల్లిగా నింపాదిగా తన ఆరాటా న్నంతా అణచుకుంటూ.

సరోజిని గుమ్మంలోకి వచ్చేటప్పటికి అక్కా చెల్లెళ్ళు ఒకర్ని చూసి

ఒకరు కంట తడిపెట్టుకున్నారు. ఎన్నో ఏళ్ళయినట్టు ఒకర్నొకరు గట్టిగా కౌగలించుకుని చాలా సేపటివరకు హృదయాలతోనే మాట్లాడుకున్నారు.

వీళ్ళిద్దరి ఆత్మీయత చూస్తుంటే సుందరం కళ్ళల్లో కూడా నీళ్ళు గిర్రున తిరిగినాయి. వాసుకుకూడా యింత ఆత్మీయత మా యింట్లో నిజానికి వుండాలి. కాని లేదు! అది యెవ్వరి లోపమైనప్పటికి యీ అనురాగం లేకపోవట మనేది మాత్రం పెద్దలోపమే అనుకున్నాడు సుందరం.

అద్దంముందు కూర్చుని జ్యోతి జడవేసుకుంటోంది. సినిమాకు వెళదామని అనుకున్నారు. ముఖ్యంగా సరోజిని పురమాయింపువలననే యీ ప్రోగ్రాం నిశ్చయమయింది. ఓమూల టైమవుతోంది. సరోజిని యిట్టే సిద్ధమయి వచ్చేసింది. జ్యోతి మాత్రం యెంతసేపటికి తెమలటంలేదు.

"ఓ మూల బావగారు తొందరపడుతున్నారు. త్వరగా రా మరి". అక్కతో గొంతుక తగ్గించి అన్నది సరోజిని.

కొరకొరలాడుతూ చివాలున లేచి నిలబడింది జ్యోతి.

"మీ అక్కయ్య కోపంలోకూడా అందంగానే వుంటుంది..." మరదలి మొహంలోకి చూస్తూ అన్నాడు సుందరం తమాషాగా, వెనకాల్నుంచి వచ్చి.

"ఆ విషయం మీకే తెలియాలి..." ముసిముసి నవ్వులు నవ్వింది కొంటెగా సరోజిని.

జ్యోతి భగ్గున మండిపడింది. పళ్ళు పటపటమనిపిస్తూ అక్కసుగా చేతిలో వున్న దువ్వెనను గిరాటు పెట్టింది. అక్కయ్యకు బాగా కోపం వచ్చిందని సరోజిని వెనక్కు తగ్గింది.

"అక్కయ్య కింతకోపం వస్తుందని అనుకోలేదు," పశ్చాత్తాపంగా అన్నది సరోజిని.

ఏమీ సమాధానం చెప్పకుండా యిట్టే చీరె మార్చుకుని వచ్చేసింది. వాకిట్లో టాక్సీవచ్చి నిలబడింది. ఎవరు ముందువెళ్ళి టాక్సీలో కూర్చో వాలా అన్నట్టు ఒకరి మొహంలోకి ఒకరు చూసుకుంటున్నారు.

"పదండి నిలబడ్డారేమిటి!..." తాళంచెవులు జేబులో వేసుకుంటూ అన్నాడు సుందరం.

చప్పున సరోజిని వెళ్ళి టాక్సీలో కూర్చుంది. వెనకాలే జ్యోతి గబగబ అడుగులు వేసుకుంటూ లోపలికి వెళ్ళింది. తర్వాత సుందరం వెళ్ళాడు. వాసేమొ డ్రైవరు ప్రక్కన కూర్చున్నాడు. బర్రున సినిమా హాలుకు వచ్చేశారు. జ్యోతి సంతృప్తిగానూ సంతోషంగాను వున్నట్టుగా తెలుస్తూనేవుంది. ఆక్కయ్యకు కోపం తగ్గిందిలే అనుకుంది సరోజని.

జ్యోతికి యిట్టే కోపంవచ్చినట్టే వస్తుంది. మళ్ళీ మరుక్షణంలో కళ కళలాడుతూ వుంటుంది. తెగ అనుమానం, సందేహం. ఫలాన కారణం అంటూ ఉండనక్కర్లేదు. తన మనస్సులో యేదో వూహించుకుంటుంది. ఎవ రేమి మాట్లాడినా, ఏ చిన్న సంఘటన జరిగినా తన వూహకు తగినట్లుగానే అన్వయించు కుంటుంది. మరింత బాధపడుతూ వుంటుంది. సరోజని యిక్కడికి వచ్చినప్పటి నుంచి జ్యోతి మనస్సు మరీ చంచల మయిపో యింది. ప్రతి చిన్న విషయం పట్టించుకుంటూ ఆరాగా అడిగి రెట్టించి రెట్టించి చివరకు తాను బాధపడుతుంది. ఇతరుల మనస్సు కష్టపెడుతుంది. ఇది అందరికీ కానరాని బాధగా వుంటోంది. ఈ మనస్తత్వాన్ని అణచుకో లేక పోతోంది.

లోపలికి వెళ్ళంగానే "కూచోండి యీ కుర్చీలో" అంటూనే ఆ

పక్క కుర్చీలో తాను కూర్చుంది జ్యోతి. ఆమెకు ప్రక్కగా చెల్లెలు కూర్చుంది. సుందరానికి రెండోవైపు వాసు కూర్చున్నాడు. జ్యోతి చీర సవరించుకుంటూ అటూ యిటూ ఒక్కక్షణం చూసి బాగానేవుంది అనుకుంది. తను అనుకున్నట్టుగానే కూర్చున్నారు అని సంతృప్తిగా నిట్టూర్చింది. జనం మెల్లిమెల్లిగా వస్తున్నారు. ఒక్కొక్క కుర్చీ భర్తీ అయిపోతోంది. సరోజిని ప్రక్కనేవచ్చి కూర్చున్నాడు ఓ హిప్పీ. ఆమె వైపుకే మెడ వాలుస్తూ కుర్చీలో ఆడిపోతున్నాడు. వెకిలిగా నవ్వుతూ పెద్దగా మాట్లాడుతున్నాడు. వెనకాల కుర్చీలోవాళ్ళతో మెడపైకెత్తి కబుర్లు చెప్తున్నాడు. సరోజిని చెయ్యితాకగానే 'సారీ' అంటూ మళ్ళీ సరిగ్గా కుర్చీలో కూర్చున్నాడు. సుందరం యిదంతా గమనిస్తూనే వున్నాడు. జ్యోతికి వళ్ళు మండిపోతోంది, సరోజిని మహా యిరకాటంలో పడిపోయింది.

"మీ చెల్లెలు యిటువైపుకు వస్తుంది వాసు అక్కడ కూచుంటాడు. ..." అన్నాడు మెల్లిగా సుందరం.

జ్యోతి మొహం ముడుచుకుంది. ఏమీ సమాధానం చెప్పలేదు. వాసు కుర్చీలను దాటుకుంటూ సరోజిని కుర్చీలోకి వచ్చేశాడు. ఆమె సుందరం ప్రక్క కుర్చీలోకి వచ్చేసింది. జ్యోతికి ముళ్ళమీద కూర్చున్నట్టుగా వుంది. మహా మంటగా వుంది. తీవ్రంగా ఆరాటపడుతోంది. ఈ కుర్చీల మార్పు ఆమెకు యే మాత్రం యిష్టంలేదు. చేసేదేమీలేక చాలా అలసటగానూ, చిరాకుగానూ కుర్చీలో అటూ యిటూ వత్తిగిలుతోంది. ఆమె ఆందోళనకు తోడు ఆ క్షణంలో లైట్లు ఆరిపోయినాయి. హాలంతా గగ్గోలు పుట్టింది. జ్యోతి కళ్ళు మూసుకుని పెద్దగా నిట్టూరుస్తోంది.

కాస్సేపటికల్లా సినిమా ప్రారంభమయింది. అందరికళ్ళు తెరమీద పడ్డాయి. కాని జ్యోతి మాత్రం సర్దుకోవటంలోనే వుంది. ఉతుకుష్టంగా కూర్చుంది, తన ప్రక్కనే వాసు కూర్చోవటం తనకే మాత్రం యిష్టంలేదు.

అంతకంటే విసుగుపుట్టే విషయం తన భర్త ప్రక్కన తన చెల్లెలు కూర్చోవటం. చీటికి మాటికి అటూ ఇటూ చూడటంతోనే సరిపోతోంది. అయినదానికి కానిదానికి సరోజిని విరగపడి నవ్వటం అమెను చూసి సుందరం నవ్వటం జ్యోతికి మహా భాధ అనిపించింది. వాసు వైపుకు ఒకటి రెండుసార్లు చూసి గతుక్కుమంది. అందులో ఈ సినిమాకూడా తన కుటుంబాన్నే చిత్రీకరించినట్టుగా కనిపిస్తోంది, దాంతో ఆమె అనుమానాలు సందేహాలు మరింత దృఢపడుతున్నాయి.

మొత్తంమీద ఆ సినిమా ఆనాటి సంఘటనలు జ్యోతి మనస్సులో బాగానాటుకుపోయినాయి. చాలా రోజులవరకు అవే కలవరపెడుతూ కనిపిస్తూ వుండేవి. నిత్యకృత్యంలో జ్యోతి చీటికి మాటికి చెల్లెల్ని చీదరించుకుంటున్నట్లు, ప్రతి చిన్న విషయంలోనూ ఆంక్షలు పెడుతున్నట్లు కనిపిస్తుంది. ఆమె తన ఉద్యోగ ప్రయత్నాల్లో చాలా వరకు యింట్లో ఉండటంలేదు. ఇంట్లోవున్న కాసేపు మాత్రం ఆమె ప్రవర్తన అప్యాయత సుందరాన్ని బాగా ఆకట్టేసినాయి. వాసు యింటిపట్టున వుంటున్నాడు. తనను ఆదరించే వ్యక్తి ఆ యింట్లో వున్నదనే భావన అతనికీ కలిగింది. దీంతో యిద్దరికీ మనశ్శాంతి పెరుగుతూవస్తోంది. అయితే జ్యోతికి మాత్రం తన చెల్లెలి ప్రవర్తన అనుమానంగానూ ఆశ్చర్యంగానూ కనిపిస్తోంది.

సరోజనికి ఉద్యోగం వచ్చేసింది. అసలు యీమె సంపాదనకు బయలుదేరింది, ముఖ్యంగా తల్లితండ్రులను పోషించటానికే. ఉద్యోగం వచ్చేవరకు అప్పగారింట్లో వుండటం తప్పనిసరి అయిపోయింది. తన మూలానే ఆ యింట్లో పొరపులు మనస్పర్థలు వచ్చినాయని తెలుసు తన వలన యే లోపం జరగలేదని తాను పొరపాటుగా ప్రవర్తించలేదని తన మనస్సుకు తెలుసు. అక్కతో చెపుదామని ప్రయత్నం చేసికూడా వినే స్థితిలో లేదని ముభావంగా వుండిపోయింది. ఇహ ఉద్యోగం వచ్చిన

తర్వాత వేరే వుందామనుకుని అక్కతో అన్నది, ఆమె వెంటనే సరే అన్నది.

"ఏం లోపం వచ్చిందని యిక్కడ, ఉద్యోగం దొరికితే మాత్రం యిక్కడ వుండరాదా నువ్వన్నా చెప్పు..." అంటూ భార్యను పురమాయిస్తున్నాడు సుందరం.

"అంతగా వెళ్ళిపోతానంటుంటే మనం ఆపటం యెందుకు! ఇష్టం లేనివాళ్ళను ఎంత వరకు బలవంతం చేస్తామేమిటి..." ఈసడింపుగా అంటోంది జ్యోతి.

సుందరమయితే సూటిగా యేమీ అనలేక పోతున్నాడు. జ్యోతి తనలో తాను ఆలోచించుకుంటోంది. తనకు అసూయ అసహనం ద్వేషం కోపం యిలాంటి లక్షణాలు యీ మధ్యనే కలుగుతున్నాయి. చెల్లెల్ని గురించి తనకొస్తున్న ఆలోచనలకు ఆధారాలేవీ లేవు. అట్లా అనుకోవటం కూడా తప్పే. ఏమయినా కాని యిప్పుడు వెళ్ళిపోతానన్న మనిషిని ఆపాలసిన అవసరమూలేదు. తనలో తాను మథనపడుతోంది. వాసు మాట తలుచుకుంటే వళ్ళు గగుర్పొడుస్తోంది. తన చెల్లెలితో అంత చనువుగా వుండటం అసలే యిష్టంలేదు, ఈ ముక్క పైకి యెట్లా చెప్పటం. తెగ ఆందోళన పడుతోంది. చెల్లెలు యీ వూళ్లోనే యింకో చోట వుండటం మంచిదా తన కంటి యెదుటేపడి వుండటం మంచిదా అనే మథనలో పడింది.

భర్తతో తన చెల్లెలు చనువుగా మాట్లాడటం కూడా సహించలేక పోతోంది. వాళ్ళిద్దరు యేమి మాట్లాడినా జ్యోతి మొహం చిటచిటలాడుతూ వుంటుంది. తనకు తానుగా వాసును పేరుపెట్టి పిలవనేలేదు. తన చెల్లెలు "వాసు" అని పిలుస్తే చాలు వళ్ళు గలతరిస్తూ వుంటుంది. నిజానికి తన

అక్క వాసును అప్యాయంగా పలకరించాలని సరోజిని కోరిక. అందుకనే తాను పిలుస్తూ అక్కయ్యకు అర్థమయ్యేలాగున చెప్పటానికి ప్రయత్ని స్తోంది, అక్కమీర తగ అక్కసుగా వుంది. కాని ఆచి ఆచి వూరుకుం టోంది. అప్పటికీ ఓసారి అననే అన్నది "మనస్సులో యేవేవో పెట్టు కుని మాత్రం నువ్వు బాధపడకు యితరులను బాధ పెట్టకు" అని.

జ్యోతి మనస్సుకు యింకా పట్టలేదు. ఊగిసలాడుతోంది. కాసేపు తన చెల్లెలు అన్నమాట నిజమేనని అనుకుంటుంది. మరుక్షణంలో తన పద్ధతే రైటని సమాధానపడుతుంది. వాసును తలుచుకుంటూ జాలి, ప్రేమ, ఆప్యాయత వెళ్ళుబుచ్చుతుంది లోపల లోపల. తీరా ఎదుట పడేటప్పటికి కోపం అసహ్యం చిరాకు ప్రకటిస్తుంది. ఘర్షణతో రోజులు దొర్లి పోతు న్నాయి. జ్యోతి మాత్రం రోజు రోజుకు కఠినంగానూ దురుసుగానూ ప్రవ ర్తిస్తూనే వుంది.

అప్పుడే సరోజిని బ్యాంకునుంచి వచ్చింది. చాలా అలసటగా వుంది. చిరాకు వడుతోంది. ఆయాసపడుతున్నట్టు నిట్టూరుస్తోంది. బ్యాంకులో తోటి గుమాస్తాల సకిలింపులు, ఆఫీసర్ అర్థంలేని ఆర్భాటం, ఇంట్లో అక్కయ్య సాధింపు, దూరానవున్న తల్లిదండ్రుల బాధలు అన్నీ సరోజినిని ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి. లేవటానికి కూడా ఓపిక లేదన్నట్టు కదిలలేక బద్ధకంగా కూర్చుంది. ఆ క్షణాన ఎవరైనా కాస్త టీ పెట్టిస్తే బాగుండుననిపించింది. కాని జ్యోతి యింట్లో లేదు. పేరంటా నికి వెళ్ళిందని తెలుసు. తనను కూడా మరీ మరీ రమ్మనమన్నది కూడా. అయితే సరోజినికి పేరంటాలకు వెళ్ళటం అసలిష్టం లేదు. తానే మెల్లిగా లేచి లోపలికి వెళ్ళింది. రెండు కప్పుల టీని తీసుకుని గిర్రున తిరిగి వచ్చే సింది. సుందరం మల్లెపందిరికింద కుర్చీలో కూర్చుని పేపరు తిరిగే స్తున్నాడు. ఓ కప్పు ఆయనకు అందిచ్చి, తానుకూడా ఓ కుర్చీని దగ్గరగా

లాక్కుని ఆయన కెదురుగా కూర్చుంది.

సుందరం సరోజినితో అంతరంగికంగా మాట్లాడాలని తెగ తాపత్రయ పడుతున్నాడు. మాట పైకి రావటంలేదు. ఆమె వైపుకే చూస్తూ మళ్ళీ కళ్ళు దించేస్తున్నాడు. సరోజిని కూడా ఆయన ఆరాటం గ్రహించి కూడా మెదిలకుండానే వుండిపోయింది. ఇహ సుందరం ఆగలేకపోయాడు. తన మనస్సులో ఆవేదన చెప్పి తీరాలనుకున్నాడు.

"...అమ్మాయి నువ్వూ వాసూ యించుమించు ఒకే వయస్సువాళ్లు. కాని వాసును నువ్వర్థం చేసుకున్నంతకూడా మీ అక్కయ్య అర్థం చేసుకోలేక పోతోంది. దీనికి కారణం యేమిటో నాకు తెలియటంలేదు. ఎవరిది లోపమా అని యెంత తర్కించుకున్నా ఏమీ బోధపడటం లేదు..." ఇంకా ముందుకు చెప్పలేకపోయాడు, బాగా అలసిపోయినట్లు కుర్చీలో అనుకున్నాడు.

మళ్ళీ కాసేపటికి ఆయాసం తగ్గిన తర్వాత మొదలు పెట్టాడు. "నువ్వు నోటినిండా 'వాసూ' అని పిలుస్తుంటే నా కెంత హాయిగా వుంటుందో తెలుసా ? ఆ పిలుపులో యెంత ఆప్యాయత ఆదరణ వుందో నే నర్థం చేసుకోగలను. నీతో యీ ముక్క చెపుదామని యెన్నాళ్ళబట్టో అనుకుంటూ వున్నా...ఇవ్వాళ్టికి వీలయింది..." ఆయన మొహమంతా చెమటలు పోసినయి. ధోవతి చివళ్ళతో తుడుచుకుంటున్నాడు.

సరోజిని కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిలినాయి.

"అతని కేం లోపం వచ్చిందని మీరంతగా బాధపడతారు..." పట్టు బిగువున అనేసింది.

"...లేదమ్మా లేదు. ఏ లోపం రాలేదు. దేవుడే పెద్ద లోపం చేశాడు, దాన్ని తీరుద్దామనే భ్రమతోనే రెండో పెళ్ళికి వప్పుకున్నాను.

మీవాళ్ళేమో నా ఆస్తిని చూసి మీ అక్కయ్యను యివ్వటానికి సిద్ధపడ్డారు. అది అందరికీ తెలిసిందే, కాని నేను కోరుకున్నది కోరుకునేది నాకు దొరకలేదు. నా బాధ దిగులు ఆదే. అంతకంటె యేం లేదు..." పూర్తిగా నిస్తేజుడయి పోయాడు.

సరోజిని తలవంచుకుని కూర్చుంది. కాసేపటికి సుందరం ఉద్రేకంగా లేచి నిలబడ్డాడు. చప్పున సరోజినికూడా లేచి నిలబడింది. ఆయన మొహంలోకి చూస్తుంటే ఆయనతో అక్కయ్య విషయం చెప్పాలనిపించింది.

"...మావాళ్లు ఉత్తరాలమీద ఉత్తరాలు కురిపిస్తున్నారు, అక్కయ్యను రమ్మనమని. మీరన్నా గట్టిగా చెప్పండి యీ సమయంలోనైనా అక్కడికి వెళ్ళితే మా అమ్మా నాన్న సంతోషిస్తారు" అన్నది బెరుకుగానే.

"నేనే..." ఆశ్చర్యంగా చూశాడు.

"నేనేమీ చెప్పలేనమ్మా. మీ అక్కయ్య వెళ్ళాలనుకున్ననాడు నేనేమీ అభ్యంతరం చెప్పను. నేను మాత్రం వెళ్ళమని అనలేను. మీ అక్కయ్య మనస్సులో యెలాంటి ఊహలు చెలరేగుతున్నాయో కొంచెం కాకపోతే కొంచెమైనా నేను తెలుసుకోగలను," చాలా ఉద్రేకంగా అన్నాడు.

సరోజిని తల పంచుకుంది, జ్యోతి తనమీద పూర్తిగా విశ్వాసం వుంచలేక పోతోందని, భర్త గౌరవానికి భంగంగా వూహించటానికికూడా వెనకాడడం లేదని ఆమెకు తెలుసు. సుందరం అన్న ముక్కలోకూడా యిదే ధ్వని స్ఫురించింది.

"పోనీలెండి, నేను యిల్లు చూసుకుంటా. ఇక్కడే వుంటూ అక్కయ్య మనస్సు కష్టపెట్టడం మేం బాగాలేదు..." బింకంగా అన్నది.

"నాకు యీమాత్రం మనశ్శాంతికూడా లేకుండా చేస్తానంటారా.." ప్రాధేయపడుతున్నట్లుగా అన్నాడు.

సరోజిని అక్కడ ఒక్క క్షణం వుండలేక పోయింది. గిర్రున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

## 3

జ్యోతికి ఆడపిల్ల కలిగిందనగానే సుందరం యెంతగానో సంతోష పడ్డాడు. కాని ఆమెకు అలాంటి అనుభూతి కలగలేదు. చాలావిచారంగానూ దిగులుగానూ వుండిపోయింది. అయినా ఆనాడు చాలా హడావిడి చేశాడు, సుందరం. తనకు బాగా డబ్బుందని బంధువులకే కాక ఊళ్లోవాళ్లకు కూడా తెలియపరిచాడు. అంత ఖర్చు పెట్టటం జ్యోతికీ యిష్టమే! తన దర్జాను ధీమాను స్వయంగా కళ్ళారా చూశారనే తృప్తి ఆమెకు కలిగింది. పిల్లకు శారదనే పేరుబాగుందని నలుగురూ అనుకున్నారు. ఆవచ్చిన బంధువుల్లో జ్యోతికి తన మేనత్త కొడుకు శేఖర్ బాగా నచ్చాడు. అతని మాటలు ప్రవర్తన పద్ధతి జ్యోతి ఆలోచనలకు సరిపోతున్నాయి. అతన్ని తనింట్లోనే కొంత కాలంపాటు వుంచాలని అనుకుని భర్తతో అన్నది. సుందరం దేనికీ కాదనడు. అందులో ఎవరో చుట్టం యిక్కడుండి ఉద్యోగ ప్రయత్నం చేసుకుంటానంటె వద్దనాల్సిన అవసరం యేమీ కనిపించలేదు. వాసు యింత సందడిలోనూకూడా బిక్కుబిక్కుమంటూ ఎక్కడో మూలగా కూర్చునట్లుగా నలుగుర్లోకి వచ్చేవాడు కాదు. అయితే అతనిలో కొంచెం మార్పు వచ్చిందనే చెప్పాలి. ఏది కావాలన్నా చిన్న పిన్నీ అంటూ చనువుగా పిలిచి సరోజినితో చెపుతూవుంటాడు. సరోజినీ బాగాయిరకాటంలో పడిపోయింది. తన అక్కను పిలవకుండా తననే చిన్న పిన్నీ అని పిలవటంలో బాగా ఎబ్బెట్టు కనిపిస్తోంది. అయితే వాసుమీద తనకున్న ప్రేమాభిమానంతో అది లెక్కచెయ్యటం లేదు. కాని రాను రాను శేఖర్ ప్రవర్తన భరింప

రానిదిగా తయారయింది. సూటిపోటి మాటలు, అయిన దానికి కానిదానికి కల్పించుకోవటం, తప్పయినా రైటయినా జ్యోతికి వత్తాసుగా పలకటం భరించలేక పోతోంది. అప్పుడప్పుడు అమాంతంగా బ్యాంకుకు వచ్చేసి సరోజినితో మాట్లాడటానికి ప్రయత్నంచేస్తాడు. తాను ఉద్యోగం చేస్తున్న బ్యాంకుకు తనకు తెలిసినవాళ్ళెవరూ రావటం ఆమెకు యిష్టంలేదు. ఈ విషయం శేఖర్‌కు తెలుసు, తెలిసినా కూడా పనికట్టుకునివస్తాడు. ఆమెను మహాయిరకాటంలో పెట్టేస్తూ వుంటాడు.

సుందరానికి దిగులు రోజురోజుకు యెక్కువయిపోతోంది. సరోజినికి శేఖర్ అంటే మహా మంటగా వుంది. గట్టిగా చివాట్లు పెట్టాలని ఆ సమయం కోసం యెదురు చూస్తున్నట్లుగా వుండిపోయింది. ఆనాడు సాయంత్రం శేఖర్ సరిగ్గా బ్యాంకు దగ్గరకు అయిదుగంటలకు వచ్చేశాడు. మేడమెట్లుదిగుతూ ఏదో ఆలోచనల్లో వుండిపోయింది సరోజిని. ఎదురుగా వస్తున్న వ్యక్తివైపుకు తలెత్తి చూసింది. గతుక్కుమన్నది. వళ్ళు ఝల్లుమన్నది. అయినా తమాయించుకుని బిగువుగా ముందుకు సాగింది. 'రానీ యివాళే యితని విషయం యేమిటో కనుక్కుంటాను' అని మనస్సులో అనుకుంటూ ధైర్యాన్ని తెచ్చుకుంది.

"నేనూ యింటికే వెళ్ళుతున్నాను, వస్తావా' అన్నాడు.

"అట్లాగా..." అంటూ యిద్దరూ టాక్సీలో కూర్చున్నారు. 'అప్పుడే యింటికి వెళ్ళి యేంచేస్తాం. రోజూవుండే గొడవలేగా, కాసేపు యీ పార్కులో కూర్చుందాం" అన్నది.

ఆమెలో వచ్చిన యీ మార్పుకు ఆశ్చర్యం, సంతోషం కలిగాయి శేఖర్‌కు.

చుట్టూ రంగు రంగుల పూలు తళ తళ మెరుస్తున్నాయి. సూర్య బింబం గుండ్రంగా దూరాన చెట్లసందుల్లోంచి కళకళలాడుతోంది. మధ్య

మధ్య ఎఱ్ఱటి కిరణాలు చెట్లను దూసుకుని సరోజిని కళ్ళల్లో గుచ్చు కుంటున్నాయి. మొహం చిటచిట లాడిస్తోంది. శేఖర్ కూడా మెదలకుండా కూర్చున్నాడు, కాసేపటిదాకా. ఆమెలో యింత హఠాత్తుగా వచ్చిన మార్పును గురించి ఊహాగానాలు చేస్తున్నాడు. అతను యేమి మాట్లాడు తాడో అని ఆదుర్దాగా యెదురుచూస్తోంది. అతన్ని చివాట్లు పెట్టటానికి పూర్తిగా సిద్ధంగానే వుంది.

"సరోజినీ..."

చప్పున తలెత్తి చూసింది.

"... నాకు జూట్ మిల్‌లో పర్సనల్ ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది..."

"కంగ్రాట్యులేషన్స్!..." ముక్తసరిగా అన్నది.

"థాంక్స్! నేను రేపే మీ యింట్లోంచి వెళ్ళిపోతున్నాను..."

"ఆఁ! ... మా యింట్లోంచా..."

"అదే మీ అక్కయ్య యింట్లోంచి అనుకో. వెళ్ళిపోయే ముందు నీతో మాట్లాడాలని పిలిచా..."

ఆమె యేమీ మాట్లాడలేదు. అయితే అతని ధోరణి ఆమెకు వింత గానే తోస్తోంది. ఆమె ఆవేశం కొంచెం తగ్గింది.

"...ఆ యింట్లో విషయాలు నాకంటె నీకు బాగా తెలుసు... జ్యోతి ఆప్యాయత లేకపోతే నేను ఒక్క క్షణం అక్కడ వుండగలిగే వాడ్ని కాదు. అందువలనే ఆమెకు అనుగుణంగా ప్రవర్తించాల్సి వచ్చింది. నా ధోరణి వలన బాధపడ్డవాళ్ళల్లో నువ్వుకూడా వుంటే నన్ను మిం చు..." తల వెనక్కు తిప్పేశాడు,

"నా మనస్సుకు యిష్టంలేని పనులు కొన్ని చెయ్యాల్సి వచ్చాయి-నేను అప్పుడప్పుడు అన్నమాటలకు కూడా చాలా విచారిస్తున్నా. నన్ను అపార్థం చేసుకోవటానికి పూర్తిగా అవకాశం యిచ్చాను. అంతకంటె నేను యెక్కువేమీ చెప్పలేను!" మళ్ళీ కాసేపు మెదలకుండా వూరుకున్నాడు.

సరోజిని కేమీ అంతుపట్టటం లేదు. శేఖర్ మీద తనకు కలిగిన చెడు అభిప్రాయము యీ మాటతో పూర్తిగా పోయింది. ఇతను యింత మంచివాడని అమె యెన్నడూ వూహించలేక పోయింది.

"...నీమీద నాకు మొదటినుంచీ అభిమానం బాగా వుంది. నువ్వంటే నాకు మొదటినుంచీ యిష్టం. అలాంటి 'లైకింగే' నీకు నా మీద లేకపోవచ్చు. దానికి కారణం నేనే. ఇహ మీ అక్కయ్య నిన్ను యెంత చెడుగా అర్థం చేసుకుంటోందో నీకు కూడా కొంచెం తెలుసనే అనుకొంటున్నాను. 'వాసూ' అని నువ్వు పిలవటం మీ అక్కయ్యకు యేమాత్రం యిష్టం లేదని తెలిసికూడా నువ్వు అట్లాగే పిలవటం యేమంత సబబో నువ్వే ఆలోచించుకోవాలి. సుందరంగారితో చనువుగా మాట్లాడటం మీ అక్కయ్యకు అసలు యిష్టంలేదు. అదీ నీకు తెలుసు. తెలిసి కూడా మీ అక్కయ్యను యెందుకు బాధపెడుతున్నావో అర్థం కావటం లేదు... ఎవరేమనుకున్నా నీమీద నాకు పూర్తి విశ్వాసం వుంది. నువ్వు చెయ్యరాని పని చెయ్యవని నాకు గట్టిగా తెలుసు..." పెద్దగా ఆయాసపడ్డాడు శేఖర్.

చప్పున లేచి నిలబడ్డాడు. కోటు విప్పేసి చేతిలోకి తీసుకున్నాడు, చొక్కాను వదులు చేసుకుంటూ అటూ యిటూ చకచక పచార్లు చేస్తున్నాడు.

సరోజిని మనస్సంతా గజిబిజిగా వుంది. ఆమెకూడా చివాలున లేచి నిలబడింది.

"...అసలు నాకు ఉద్యోగం రాగానే అక్కడినుంచి వెళ్ళిపోదా మనుకున్నా. కాని బావగారు పట్టుపట్టి ఆపారు. అయితే నేను ఒక్కక్షణం ఆ యింట్లో వున్నా నాకోసం కాదు, ఆ కుటుంబంకోసం. అంతకంటె నా స్వార్థం యేమీ లేదు. నన్ను యితరులు యే విధంగా అనుకుంటున్నారో తెలిసికూడా అవమానాన్ని భరిస్తూ వున్నానంటే మా అక్కయ్యమీద నాకు సహజంగా వున్న ప్రేమే కారణం... వాసు సంతోషంగా వుంటే బావగారికి ఆనందం. అతను యిప్పుడిప్పుడే సరదాగానూ, సంతోషం గానూ వుంటున్నాడు. దానికి కారణం నేనేనంటే నాకు సంతృప్తేగాని విచారం యేమీలేదు. అక్కయ్య బావగార్కి వేళకు యేమి కావాలో కనుక్కోదు,పిలిచినా పలకదు, విసుక్కుంటుంది. నేను ఆయన మాట పట్టించుకుంటే మా అక్కయ్యకు తెగ అసహనం నన్ను అనరానిమాటలు అన్నది. ప్రతి రోజూ సూటిపోటి మాటలతో దెప్పి పొడుస్తూనే వుంటోంది. ఇవన్నీ భరిస్తూ నేను అక్కడే వుండాలసిన అవసరం నాకేమీలేదు అక్కయ్యకు యివ్వాళ తెలియకపోవచ్చు. ముందుముందు తెలుసుకోగలదనే విశ్వాసం తోనే అక్కడ వుంటున్నా. వాసంటే నాకేమిటో అమితమైన ఆప్యాయత. చిన్నపిన్నీ అని పిలుస్తుంటే నా ఒళ్ళు నాకు తెలీదు. నేను లేకపోతే అతనేమయిపోతాడో అని భయంగా కూడా వుంది. బావగారికి నన్ను చూస్తే యెంతో ఆదిరణ..." సరోజిని పూర్తిగా అలిసిపోయింది.

"నేనుకూడా యీ ఊళ్ళోనే వుంటున్నానుగా, నావలన నీకేమైనా సహాయం కావాలంటే కబురుచెయ్యి, తప్పక వస్తా... నిన్ను మెచ్చుకునే వాళ్లు సుందరంగారు, వాసే కాదు. నేనుకూడా వున్నానని మాత్రం మరిచి పోవద్దు..."

సరోజిని మొహం విప్పారింది. కాని యేమీ అనలేకపోయింది. కాసేపటికల్లా యిద్దరూ యింటికి వచ్చేశారు.

# 4

శారదంటే సుందరానికి పంచప్రాణాలూను. అందుకనే జ్యోతికి కూతురంటే మంట. కొట్టటం తిట్టటం బాగానే ప్రారంభించింది. ఆయన విలవిలలాడిపోతూ వుంటాడు.

"నాన్నా... అమ్మ మంచిది కాదు. నేను వెళ్ళాను...నన్ను మళ్ళీ కొట్టింది... అదుగో పిలుస్తోంది... నేను వెళ్ళను ..." శారద వెక్కి వెక్కి ఏడుస్తూ తండ్రి దగ్గర కూర్చుంది.

జ్యోతి గభాలున వచ్చింది. శారద ఉలిక్కిపడింది. "మరీ మీరు దాన్ని గారాబం చేస్తున్నారు— రావే—" శారద చెయ్యి పట్టుకుంది.

"దాని వీపుమీద అరచెయ్యి ముద్ర చూశావా, అంతసేపు కొట్టు కుంటారా పసిపిల్లని—" సుందరం రొప్పుతున్నాడు.

"పసిపిల్ల పసిపిల్ల తీరుగా వుంటోందా. నా ప్రాణం తోడుతోంది. తెల్లారి లేచినప్పటినుంచి ఒకటే వేధించుకు తింటుంది. చెప్పినమాట ఒక్కటీ వినదు— పద—"

"అసలు దాన్ని చెయ్యిచేసుకోవద్దని నీకెన్నిసార్లు చెప్పాను," సుందరం గట్టిగా అన్నాడు.

దాంతో జ్యోతి పట్టుదల మరింత యెక్కువయింది. శారద చెయ్యి పట్టుకుని గబగబ లాగింది. హడలిపోయింది శారద. పెద్దపెట్టున ఏడవటం మొదలు పెట్టింది.

"ఏమిటీ యీ గోల. దాన్ని అట్లా లాక్కుపోతా వెందుకు? వదిలి పెట్టరాదు ..." వాసు లోపల్నుంచి వస్తూనే కోపంగా అన్నాడు, జ్యోతి వైపు చూస్తూ.

"అడ్డమైనవాళ్ళూ నాకు చెప్పేవాళ్ళే, నా పిల్లను నేనుకొట్టుకుంటా,

చంపుకుంటూ, మధ్య నువ్వెవరు చెప్పటానికి ..." జ్యోతి శారదను బర బర యీడ్చుకుంటూ తీసుకువెళ్ళింది.

'ఈ హింస నే భరించలేకుండా వున్నా. నువ్వన్నా గట్టిగా చెప్పవేం నాన్నా—" వాసుకు తండ్రిమీదే బాగా కోపం వచ్చింది.

సరోజిని మూలగా కూర్చుని నోరు నొక్కుకుంది. లాక్కొచ్చి వంటిట్లో పడేసిన శారద తప్పించుకుని గబగబ సరోజిని దగ్గర చేరింది 'పిన్నీ పిన్నీ నాకు భయమేస్తోంద'ంటూ. ఇంతలోకి యెక్కడి నుండి వచ్చిందో వచ్చింది ఓ కుక్క శారదకు కంచంలో పెట్టిన అన్నం కాస్తా తినేసింది. జ్యోతి గిర్రున వచ్చి చూసింది. అక్కసు పట్టలేకపోయింది. పిచ్చికోపం యెక్కువయింది. ఎక్కడ చచ్చిందీ అంటూ నాలుగుమూలలా చూస్తూ, సరోజిని ఒళ్లో పడుకుని మూలుగుతున్న శారదను గభాలున లేవ దీసి బలంకొద్దీ కొట్టింది.

"నాన్నా..." ఆవురుమంటూ కింద పడిపోయింది శారద.

ఆ చప్పుడుకు ఆ కేకకు సుందరం "పాపా పాపా" అంటూ లేవ బోయి హఠాత్తుగా క్రిందపడిపోయాడు.

సరోజినికి గుండె ఆగినంత పనయింది. బిత్తర పోయి చూస్తూ, 'వాసూ' అని గట్టిగా కేక పెట్టింది.

"డాక్టర్ని పిలుచుకురా . . . " గాభరాగా అన్నది– జ్యోతి గజ గజ వణికి పోయింది. భయంగా భర్తదగ్గరకు వెళ్ళి 'ఏమండీ' అని మెల్లగా పిలుస్తుంది. అయన పలకలేదు. ఆమెకు మరింత గాభరాగావుంది. ఎవరి తోనూ మాట్లాడటానికి మనస్సు వప్పటంలేదు. ఆ స్థితిలో భర్తను చూస్తుంటే మరింత హడలు పుడుతోంది. అంతలోకి డాక్టరు రానేవచ్చాడు. సుందరాన్ని పరీక్షచేసి గాభరాపడాల్సిన పనేమీ లేదు. అని ధైర్యం

చెప్పాడు. శారదను చూస్తూ యీ వాత లేమిటి?" అన్నాడు ఆశ్చర్యంగా.

సరోజినికి దుఃఖము ఆగలేదు.

"మా పిన్ని కొట్టింది ..." వాసు దభాలున అనేశాడు.

"అసలు ఆ దెబ్బ తాకిడికే మా నాన్న కూడా అట్లా అయిపోయాడు" తన కసి అక్కసు అణచుకుంటూ చెప్పాడు వాసు.

జ్యోతి తల వంచుకుని మొహం కనిపించకుండా ప్రక్కకు తిప్పుకుంది.

డాక్టరు వెళ్ళిపోగానే కొరకొర వాసువైపు చూస్తూ చరచర వెళ్ళిపోయింది జ్యోతి. వాసుకు స్వతహాగా పుట్టినబుద్ధి కాదు. ఆడిస్తోంది ఆడుతున్నాడు అని మనస్సులో అనుకుంటూ సరోజిని వైపు తీవ్రంగా చూసింది.

తెప్పరిల్లగానే అమాంతం పాపకు యెట్లావుందీ అన్నాడు సుందరం.

"అడుకుంటోంది లెండి ... పాపా ... నాన్నగారు పిలుస్తున్నారు రా అమ్మా" జ్యోతి ఎక్కడలేని ఆప్యాయత వెళ్ళబుచ్చింది.

శారద మెల్లిగా ఏచ్చి తల్లి ఒడిలో కూర్చుంది.

మళ్ళి సాయంత్రం డాక్టరు వచ్చాడు. సుందరాన్ని పరీక్షచేస్తూ వివరాలు అడుగుతున్నాడు. జ్యోతికూడా ప్రక్కనే నిలబడి ఆరాగా వింటోంది.

"...నాకు సుస్తీయేమీ లేదనుకుంటాను. పిల్లను కొడుతుంటే నే బాధపడకుండా వుండేటట్లు ఏదైనా మందివ్వండి..."అన్నాడు సుందరం.

"అలాంటి మందు యింకా కనిపెట్టలేదు లేండి ..." నవ్వుతూ అన్నాడు డాక్టరు.

జ్యోతి మొహం చిటచిట లాడింది.

వాసవుతే జ్యోతికి సంబంధించి నంతవరకు పూ ర్తిగా మారిపోయి నట్టే కనిపిస్తున్నాడు. చాటుమాటుగా పుట్టింటారికి డబ్బు పంపించటం, దుబారా ఖర్చు చెయ్యటం వాసు కేమాత్రం యిష్టంలేదు. ఎదిరించి సమాధానం చెపుతున్నాడు. లెక్కలేనట్లు మాట్లాడేస్తున్నాడు. ఇది చాలా బాధగా వుంది జ్యోతికి. తాను చేస్తున్న ప్రతి పనికి వాసు అడ్డం వస్తున్నాడనే భావన కలిగింది. పిన్నిని యిట్లా విచ్చలవిడిగా ఖర్చుచెయ్యనిస్తే చివరకు తనకేమీ మిగలదనే ఆలోచన వాసుకు వచ్చింది. ఇట్లా కొన్నాళ్ళు ఘర్షణ. పడీ పడీ వాసు నిర్మొహ మాటంగా తండ్రితో అనేశాడు. నా భాగం యేమిటో నాకిచ్చే సెయ్యమని. సుదరం చప్పున త్రుళ్ళిపడి మళ్ళీ తనలో తాను సమాధానపడ్డాడు. నిదానంగా ఆలోచిస్తే వాసు అన్నదాంట్లో సబబే అనిపించింది. భాగాల పంపిణీ అయిపోయింది. జ్యోతికి పట్టరాని అక్కసు, అహంకారం, కోపం వచ్చేసినాయి. కాని వాసును యెదిరించి తానేమీ సాధించలేననే సమ్మకంతో మెదలకుండా వుండిపోయింది. ఆస్తి పంపకంఅయినప్పటినుండి జ్యోతి భర్తంటే యీసడింపు నిర్లక్ష్యం, అసహ్యం యెక్కువయి పోయినాయి. పైగా తల్లి వారానికొక ఉత్తరం రాస్తూ వుంటుంది. ఆ ఉత్తరంలో అంతా జ్యోతిని గురించిని పొగడ్తలే. సుదరం, వాసులను గురించి ఎద్దేవాగానూ, యీసడింపుగానూ వ్రాయటం. దీంతో జ్యోతికి యింకా యెక్కువ మద్దతు, అండ యేర్పడ్డాయి. సరోజినికి యెక్కడికైనా వెళ్ళిపోదామని గట్టిగావున్నా ఆ సమయానికి సుందరం యేదో మాట అనడం దాంతో చల్లబడిపోవటం జరుగుతూ వుంది. మొన్నీ మధ్య మళ్ళీ అన్నాడు.... పెళ్ళికాని పిల్లవి, ఇంత చిన్న వయస్సులో నీకు యింత పెద్ద బాధ్యత పెట్టుతున్నానని అనుకోవద్దు. వాసు పెళ్ళనుకుంటు న్నాంగదా, వాడి పెళ్ళయ్యేదాకా యిక్కడ వుండకూడదా' అని. మళ్ళీ

సరోజిని మథనలో పడిపోయింది. ఇది సబబుగా వున్నట్టే కనిపించింది. మళ్ళీ తన ప్రయత్నాన్ని విరమించుకుంది.

ఆ ఘడియ రానే వచ్చింది. వాసు పెళ్ళయిపోయింది. ఇహ తన బాధ్యతంటూ యేమీలేదులే అని తృప్తిగా అనుకుంది సరోజిని. నిన్న మొన్నటిదాకా తన విషయం ఆలోచించు కోవటమేలేదు. ఇహ తాను, తనిల్లు అనుకుంటోంది. ఈ మాట స్ఫురణకు వచ్చినప్పుడల్లా శేఖర్ కళ్ళల్లోకి వచ్చి కూర్చుంటాడు. ఒక్కొక్కప్పుడు నీకు 'తాళి' కడతా అన్నట్లు బెదిరిస్తున్నట్టు కనపడేవాడు. తనలో తాను నవ్వుకునేది. అవును తనబావే అయినా తాను యివ్వని చనువు అతనెట్లా తీసుకోగలడు ! తర్జనభర్జన పడుతూ వుంటుంది. ఏది నిర్ణయించుకోవాలో అర్థంకావటంలేదు. ఈ మధ్యనే వాసు పెళ్ళిలో హఠాత్తుగా ఓ వ్యక్తి తారసిల్లాడు. ఆయన వాసు భార్య, శ్యామలకు దూరపు చుట్టం. అతని ముఖవర్చస్సు, మాటల పొందిక, ప్రవర్తన అన్నీకూడా సరోజినిని యిట్టే ఆకర్షించినాయి. ఆమెను ఆకట్టేసినాయి. అతని రూపు ఆమె కళ్ళలో గంటల తరబడి నిలిచివుంటోంది. ఆ పెళ్ళిలో అప్రయత్నంగా అతని చూపులు ఆమె చూపులు కలవటం, ఒళ్ళు గగుర్పొడవటం ఆమెకు గుర్తువస్తూనే వుంటుంది. అప్పుడే చాలా సార్లు చూడటం అయింది. మాట్లాడటం అయింది. అంత మాత్రంచేత అతనికి కూడా తనమీద అలాంటి అభిప్రాయమే వుందో లేదో యెట్లా తెలుసుకోవటం ? సరోజిని ఆలోచిస్తున్నకొద్దీ రకరకాల సమస్యలు యెదురవుతున్నాయి. అతని మాటలు వినటానికి సరదాగా వుంటుంది. చాలా హాస్యంగానూ, హాయిగానూ మాట్లాడుతాడు. ఆ కంఠంలోనే అదోరకమైన మాధుర్యం వుంది. ఎంతసేపైనా వినబుద్ధి పుడుతుంది.సరోజిని అతన్ని మననం చేసుకుంటూ మైమరుస్తోంది.

'చిన్నత్తయ్యా' అని శ్యామలొచ్చి పిలిచేదాక సరోజిని యీ ప్రపం

చంలో లేదు. చప్పున తల విదిలించేసి కళ్ళార్పుతూ 'ఏమిటీ?' అన్నది, పరధ్యానంగా.

'అత్తయ్యగారు పిలుస్తున్నారు...' అన్నది మెల్లిగా.

'ఏమిటి ఆవిడ పిలిచేది...' కస్సుమని లేచాడు వాసు. కారణం వున్నా లేకపోయినా చీదరించుకున్నట్టు మాట్టాడుతోంది జ్యోతి. శ్యామలవుతే తానేమి పొరపాటు చేశానా అని ఆలోచించుకుంటోంది. వాసు పట్టు బిగువున వున్నాడు. ఈ యింట్లో పొరపులన్నీ శ్యామలకు చెప్పటం యెందుకు. ఇహ వేరేవుంటే యీ గొడవలేవీ వుండవుగదా అని అనుకుంటున్నాడు. జ్యోతి సవతితల్లి అనే మాటను వాసు మరిచిపోదామనుకున్నా, ఆమె మాటిమాటికి గుర్తు చేస్తూనే వుంది. ఇది భరించరాని బాధగా వుంది.

ఆనాడు శారద పుట్టినరోజు. ఘనంగా చెయ్యాలని సుందరం అనుకున్నాడు. నలుగుర్నీ భోజనానికి పిలిచాడు. వాసుకూడా హడావిడిగా అన్ని పనులూ అజమాయిషీ చేసుకుంటూ పోతున్నాడు. భోజనానికి పిలిచినవాళ్ళల్లో శేఖర్, సత్యం కూడా వున్నారు.

సరోజినికి ఆనాడు యెవరెవరు వస్తున్నారో తెలీదు. అసలు శేఖర్, సత్యం వస్తారని ఆమె ఊహించలేక పోయింది. శేఖర్‌ను చూసవుతే ఆశ్చర్యపడలేదు. అతను ఊళ్ళోనే ఉద్యోగంలో వుంటున్నాడు. జ్యోతి పిలవమని చెప్పి వుంటుంది, అనుకుంది. కానీ సత్యం రావటం చాలా ఆశ్చర్యంగానేవుంది. వాసును ఆనాడు పెళ్ళిలో చూడటమే, మళ్ళీ యీనాడు కనిపించాడు. సుందరం, సత్యం మాట్లాడుకుంటుంటే సరోజిని తొంగి తొంగి మరీ చూస్తోంది. అసలు అతనితో మాట్లాడటం ఎవరికైనా సంతోషంగానే వుంటుంది. బహుశా బావగారికికూడా అతనిమీద అదే అభిప్రాయం

కలిగి వుండాలి, లేకపోతే యీ కాస్త చుట్టరికానికి పనికట్టుకుని ఆయ న్నెందుకు పిలుస్తారు.

ఓ మూల శారద పుట్టినరోజని నలుగురూ వచ్చి కూర్చుంటే సరోజిని ఆమాటే మరిచేపోయింది. ఎంతసేపటికీ శేఖర్, సత్యం యీ యిద్దర్ని గురించే తెగ ఆలోచిస్తోంది. ఈ యిద్దరూ కూడా తన యెదుట నిలబడి నీ 'ఛాయస్' ఏమిటి అని అడుగుతున్నట్టుగా కనిపిస్తున్నారు. మరింత తికమకపడి పోతోంది. సత్యం చివాలున లేచి వాకిట్లోకి వస్తూ సరోజినిని చూసి 'నమస్తే' అంటూ నవ్వాడు. సరోజిని ఒళ్ళు ఝల్లు మన్నది. తడబడుతూ 'నమస్తే' అనకలిగింది. గుటకలు వేసుకుంటూ రెండడుగులు వేసిందో లేదో శేఖర్ ప్రత్యక్షమయ్యాడు. ఒకర్ని చూసి ఒకరు నవ్వుకున్నారు.

ఇహ సరోజిని శారద దగ్గరకు వెళ్ళి ముస్తాబు చెయ్యటంలో వుండి పోయింది. యాంత్రికంగా అన్ని పనులు చేసుకుంటూ పోతోందే కాని తన మనస్సుమాత్రం తెగ మథనపడుతోంది.

'యూ ఆర్ టెర్రిబ్లీ బిజీ... మళ్ళీ కలుసుకుందాం...' అంటూ సత్యం సరోజిని దగ్గర శలవు తీసుకున్నాడు.

ఆమె మనస్సు ఊగిసిలాడి పోయింది.

'సరోజినీ...వస్తా...వుయ్ విల్ మీట్ ఎగైన్...' శేఖర్ నవ్వు కుంటూ వెళ్ళిపోయాడు.

ఆమె హృదయం రెపరెపలాడింది.

ఇద్దరివైపు ఆలోచనగా చూస్తూ కీర్తిశేషులు పాడిన "మనసుగతి యింతే" పాటను స్ఫురణకు తెచ్చుకుంటోంది, సరోజిని.

## 5

సుందిరానికి "హార్ట్ ఎటాక్" అయింది. అంతా గాభరాగా వుంది. అందరి ఆలోచనల్లోనూ యిట్టే మార్పు వచ్చేసింది, ఆ క్షణంలో. జ్యోతి నెత్తిన పెద్దబండరాయి పడ్డట్లయింది. వాసు హృదయం భారంతో కుంగి పోతోంది. సరోజినికి ఆ క్షణంలో సానుభూతి, జాలి కలిగినాయి. ఆయన కందరూ ధైర్యం చెపుతున్న వాళ్ళే. ఇది మైల్డ్ ఎటాక్ అని డాక్టరుగారు చెప్పారు. భయపడాల్సిన పనేమీ లేదు. మీరు కంప్లీట్ రెస్టు తీసు కోవాలి, అని సలహా యిస్తున్నారు. మంచంలో పడుకునివున్న సుందరం అన్నీ వింటూ యేమీ సమాధానం చెప్పలేదు. శారద జుట్టు నిమురుతూ దగ్గరకు తీసుకున్నాడు.

క్రమక్రమంగా కోలుకుంటున్నాడనే అందరూ అనుకుంటున్నారు. మెల్లిగా లేవటం, కాసేపు కూర్చుని మాట్లాడటం, ఉద్రేకం, ఆవేశం కల గకపోవటం యివన్నీ మంచి లక్షణాలేనని సుందరం కూడా అను కున్నాడు. కాని తన మనస్సుకు యేదో ఆందోళన, ఆరాటం కలుగు తున్నాయి.

"నాకీ సుస్తీ చేసినప్పటి నుంచీ రోజులు లెక్కపెట్టుకుంటున్నా. ఆయుర్దాయం వుంటే యింకా బతకొచ్చు .... ...." ఏదో చెప్పబోతూ సరోజిని వాలకం చూసి చప్పున ఆగిపోయాడు.

"వాసూ మీ నాన్నగారికి ఆయాసంగా వుంది ...." తత్తరగా అన్నది సరోజిని.

"డాక్టరుగారు కదలొద్దన్నారు ..."

"అవును అందరూ నన్ననేవాళ్ళేరా..." విసుకున్నాడు, సుందరం.

అడుగో శేఖర్ బాబాయి వస్తున్నాడు, సంతృప్తిగా చూశాడు వాసు.

"ఎట్లా వుంది నాన్నకు ..." వస్తూ వస్తూనే అడిగాడు శేఖర్.

"రా... నా దిగ్గర కూర్చో ... క్షణంలో ముంచుకొచ్చేది మనకు తెలియదు గదా, నా స్థితి యిట్లా అయిపోయింది, నా చేతులు కొంకర్లు పోతున్నాయి, ఒళ్ళంతా బిగదీసినట్టుగా వుంది,..."

ఇంకా యేదో చెప్పబోతూ వాసు వంక తిరిగి సౌంజ్ఞ చేశాడు. వాసు అవతలకు వెళ్ళి పోయాడు. ఇహ ఆ గదిలో యిద్దరే వున్నారు.

"... సరోజిని మానవమాత్రురాలు కాదు ... దేవత ...వాసుకు కొత్త జీవితాన్ని ప్రసాదించింది. నాకు మనశ్శాంతి యిచ్చింది. తాను కష్ట పడి, నష్టపడి యితరుల సుఖంకోసం అహర్నిశలు తాపత్రయ పడింది. చాలా ఉత్తమురాలు. చదువూ సంస్కారం కలది. సంపాదిస్తోంది. ఇంకా యెక్కువ చెప్పనక్కర్లేదు. నాకు జ్యోతి సూచనగా చెప్పింది కూడా. అంత కంటే సంతోషం యేముంది. మీ యిద్దరు పెళ్ళిచేసుకుంటే చూసి చీకూ చింతా లేకుండా హాయిగా, తృప్తిగా కన్నుమూస్తా ..." సుందరం తన ఆవేదనంతా వ్యక్తం చేశాడు.

ఈ మాటలు వింటూంటే శేఖర్‌కు చాలా ఆశ్చర్యం కలిగింది. సుందరం గారికి తనమీద యిలాంటి మంచి అభిప్రాయం వున్నట్టు యెప్పుడూ వూహించలేదు. తానీ యింట్లో వున్నప్పుడు ఆడిన నాటకం అన్న మాటలు ఆ క్షణంలో గుర్తుకొచ్చి చాలా సిగ్గుపడ్డాడు. చప్పున తన పెళ్ళి విషయంలో యీయనకు యింతవరకు ఆలోచన యెందుకు పోయిందా అని మధనపడుతున్నాడు. సరోజిని కూడా తనను అపార్థం చేసుకున్న వ్యక్తే. కొంతవరకయినా అలాంటి దురభిప్రాయం తొలగిపోవ టానికి ఉన్నది వున్నట్టుగా చెప్పేశాడు. అంతమాత్రంచేత తనమీద అలాంటి అభిప్రాయం సరోజినికి కలిగి వుంటుందా ? సరోజిని వప్పుకున్న

తర్వాతే తన్ను అడుగుతున్నాడేమో ! దానంతట తానే పెద్దరికం తీసుకుని ఆమెతో ప్రస్తావించకుండానే యీ ముక్క అంటున్నాడా. తీరా నేను ఒప్పుకున్నా ననేమాట అన్న తర్వాత సరోజిని కాదంటే యెంత అవమానం చాలా ముఖ్యమైన విషయాన్ని నిమిషాలమీద అవును కాదని చెప్పటానికి సాధ్యపడదు. తనలో తాను తర్జన భర్జన పడుతున్నాడు.

మళ్ళీ సుందరం యేదో అనబోతున్నట్టు పసికట్టి—

"చూడండి. మీ ఆరోగ్యం బాగా కుదుటపడనీయండి, ఆ విషయాలేమిటో.. ఆలోచిద్దాం. ఇప్పుడు మీరు ఆరాటపడకండి. మీకు విశ్రాంతి చాలా అవసరం..." మాట తప్పించటానికి ప్రయత్నం చేశాడు శేఖర్.

"నాకింక విశ్రాంతి యేముంది నాయనా. మీ యిద్దరి పెళ్ళి చూసిం తర్వాత అంతా రెస్టే నాకు. సరోజినికి యేమీ చెయ్యలేకపోయాననేబాధ నన్ను బాగా పీడిస్తోంది. డబ్బు దస్కం నే చూస్తాను. నువ్వు ఆవిషయంలో ఏమీ అనుమాన పడద్దు. ఆమాత్రం నేను చెయ్యగలిగితే నాకు పూర్తిగా మనశ్శాంతి కలుగు తుంది" .... ఇంకా ఆయాసం యెక్కువయింది.

"మీరు యింతగా చెప్పిన తర్వాత యీ పరిస్థితుల్లో నేను ప్రత్యేకంగా అనేదేమీ లేదు ... మీరు పూర్తిగారెస్టు తీసుకోండి ...." అని హృదయంమీద చెయ్యిచేసి చప్పున గిర్రున వెనక్కు తిరిగాడు శేఖర్.

"జ్యోతి" .... కొంచెం బిగ్గరరానే పిలిచాడు, ఆవేశంగా "శేఖర్—ఒప్పుకున్నాడు—" అన్నాడు. జ్యోతి తడబడుతూ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ గబ గబ లోపలికి వచ్చింది.

ఆమెను చూస్తూనే – "ఏమిటి ! ఏడుస్తున్నావా ! ఎందుకు ! మనస్సు నిబ్బరం చేసుకోవాలిగాని యిట్లా యేడిస్తే శారద యేమవుతుంది"

"....ఏమిటండీ ఆ మాటలు..." దుఃఖం పొర్లుకొచ్చింది.

"...నేను పాపిష్టిదాన్ని - మీ మనస్సు కష్టపెట్టా. మీరు - నట్టింట్లో తిరుగుతున్నన్నాళ్ళు నాకు మతిపోయింది. మీకు అన్నీ వ్యతిరేకమే చేశాను. మీకు సంతోషం కలిగేది ఒక్కటీ చెయ్యలేదు – నాకేదో భయంగా వుంది –" ఏడుస్తూ భర్తచెయ్యి పట్టుకుంది.

"–జ్యోతీ – ఏడవవద్దు – నువ్వు ఏం చేశావని –"

"— నిజానికి – నిన్ను పెళ్ళిచేసుకుని – నీకు ఘోరమైన అన్యాయం చేశా –"

జ్యోతి పెద్దపెట్టున బావురుమని ఏడ్చింది. ఆయన కాళ్ళు తన మొహంమీద పెట్టుకుని తలబాదుకుంటూ ఘోష పెడుతోంది.

"వదిలిపెట్టు – నువ్వు చేసిందేమీ లేదు. ఇది మన కర్మ - అంతా భగవంతుడే చేశాడు –" ఆమె చేతులు పట్టుకుని లేవదీసి దగ్గరకు తీసుకున్నాడు.

"విన్నావా! – శేఖర్ ఒప్పుకున్నాడు."

"పోన్లెండి. అవన్నీ యిప్పుడెందుకు. మీరు ఏ ఆలోచనా పెట్టుకోకుండా పడుకోండి –" జ్యోతి గద్గదికంగా అన్నది.

"నాకు యింకో ఆలోచన యేమీలేదు. సరోజిని పెళ్ళి చూడాలని మాత్రం గట్టిగా వుంది. ఆ విషయంలో పూర్తిగా బాధ్యత నేనే తీసుకుని మీ చెల్లెలికి ప్రత్యుపకారం చెయ్యాలని వుంది – అంతే –" సుందరం తన మనస్సులో ఆవేదనను చెప్పేశాడు.

జ్యోతి మారుమాటాడలేక పోయింది.

అంతలోకి డాక్టరు రానేవచ్చాడు. "అంతా బాగానే వుంది? కాని మీరు యిక్కడవుంటే రెస్టు వుండటం లేదు. మీరు యేమీ అనుకోకుండా

వుంటే ఓ సలహా చెపుతాను – "అంటూ సుందరం జ్యోతి మొహంల్లోకి చూస్తూ "హాస్పిటల్‌లో చేర్పించండి – త్వరగా కోలుకుంటారు – అన్నాడు.

జ్యోతి గుండె ఝల్లుమంది. సుందరంకూడా ఒక్క క్షణం నివ్వెర పోయినట్టు చూశాడు.

"రెస్టుకోసమే – అంతకంటే యేం లేదు. అక్కడ అన్ని ఫెసిలిటీస్ వుంటాయి – ఒక వారం పదిరోజుల్లో తిరిగి రావచ్చు. ఈ యింట్లో వుంటే మీక్కావలిసిన రెస్టు దొరకటం లేదు. ఎక్స్‌క్యూజ్ మీ, అట్లా అన్నందుకు" డాక్టరు స్పష్టంగా చెప్పేశాడు.

"దానికేముంది అట్లాగే వెళతాను" అన్నాడు తాపీగా సుందరం.

అందరి కంటె యెక్కువగా ఆరాటపడుతోంది సరోజిని. అయితే బావగారు కోలుకుంటున్నారని అంటుంటే కాస్తంత మనశ్శాంతిగా వుంది. అయినా తనకు పూర్తిగా విశ్వాసం చిక్కటం లేదు. జ్యోతిలో పూర్తిగా మార్పు వచ్చినట్టు కనిపిస్తోంది. ఆసుపత్రికి వెళుతోంది వస్తోంది. ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడటం లేదు. కాని యేదో మానసికంగా తీవ్రమైన బాధపడుతున్నట్టు మాత్రం ఆమె మొహమే చెపుతోంది. ఆమెను చూస్తుంటే సరోజినికి జాలి, ప్రేమ, విచారం కలుగుతున్నాయి. ఆమెను పలకరిద్దామని ఏదో మాటాడాలని గట్టిగా అనుకుంటున్నా సమయం దొరకటం లేదు. బుద్ధి పుట్టటంలేదు.

ఆనాడు జ్యోతి వంటరిగా వంటింటి గుమ్మందగ్గర కూర్చుని గడ్డం కింద అరచెయ్యిని ఆనించి అదేపనిగా చూస్తోంది. తలుపుచాటున నిలబడి సరోజిని కూడా అటే చూస్తోంది. జ్యోతి కదలటం లేదు, మెదలటం లేదు. సరోజిని మనస్సు విలవిలలాడి పోతోంది. అక్కయ్య నిస్సహాయత

చూస్తుంటే మనస్సు చలించింది. పోనీ వెళ్ళి పలకరిద్దాం అనుకుంటూ మెల్లిమెల్లిగా అడుగులేస్తూ దగ్గరగా వెళ్ళింది. అలికిడి కనిపెట్టికూడా జ్యోతి కదల్లేదు.

"అక్కయ్యా!...." ఆప్యాయంగా పిలిచింది

"ఊ...." అన్నదేకాని అప్పటికి వెనక్కి తిరగలేదు. మెల్లిగా ప్రక్కనే కూర్చుని "అట్లా యెంతసేపని ఆలోచిస్తూ కూర్చుంటావు....రా ...." అంటూ ఆమె చెయ్యి పట్టుకుంది.

చప్పున వెనక్కు తిరిగి బావురుమని ఏడుస్తూ సరోజినిని చుట్టేసుకుంది. సరోజిని హడలిపోయింది. "అక్కయ్యా ఏమిటిది...." అంటోందేగాని జ్యోతి మాత్రం వెక్కి వెక్కి ఏడుస్తూనే వుంది.

"నీకన్నీ తెలుసు .... నా బతుకు నీ చేతిలో వుంది. బావగారు అనుక్షణం నీ మాటే తలుచుకుంటున్నారు. నువ్వంటే చెడ్డ అభిమానం. నువ్వూ శేఖర్ పెళ్ళిచేసుకుంటే ఆయనకు చూడాలని వుంది. శేఖర్ అన్ని విధాల తగినవాడే, అది నీకూ తెలుసు. ఈ పెళ్ళి జరిగితే ఆయన మనస్సు కుదుటపడుతుంది. త్వరగా కోలుకుంటారు. ఇహ ఆయనకేం భయంలేదు. నా మొహం చూసైనా సరే ఊఁ ... అను ...." గుక్క తిప్పుకోకుండా ప్రాధేయపడుతున్నట్టుగా అనేసింది.

సరోజిని ఉక్కిరి బిక్కిరయి పోయింది ఇంత ముఖ్యమైన విషయం నిమిషాల మీద చెప్పాలంటే చేతకావటంలేదు. తబ్బిబ్బులయిపోతోంది. జ్యోతి మొహంలోకి చూస్తుంటే హడలిపోతోంది. ఎర్రటి కళ్ళు గాంభ్రీంపు మొహం భయంకరంగా కనిపిస్తోంది. క్షణంలో ఆసుపత్రిలో మంచంమీద వెల్లకిలా పడుకుని వున్న సుందరం కనిపించాడు. మరుక్షణంలో సత్యం కడ్లల్లోకి వచ్చికూర్చున్నాడు. "మిమ్మల్ని శ్యామల పెళ్ళిలో చూసినప్పటి

నుంచి ఏదో అడగాలని ఏదో చెప్పాలని తహ తహ బయలుదేరింది. ... అయితే నా అంతట నేను అంత చనువు తీసుకుని మాట్లాడటం యెంత వరకు సబబుగా వుంటుందో అర్థంచేసుకోవచ్చు. నా మనస్సు బైటపెడితే నేనూ చులకన అయిపోవచ్చు ... అలాంటి అవకాశం మీకు యివ్వదలుచు కోలేదు అప్పట్లో. తర్వాత చాలాసార్లు మనం ఒకర్నొకరు చూసుకున్నాం. నోటితో మాట్లాడలేక పోయినా హృదయాల్తో పలకరించుకున్నామనే విశ్వాసం నాకు వుంది ... ఇహ యింత ఉపోద్ఘాతం చెప్పిన తర్వాత కూడా మీరు చెప్పదలచుకుంది ఏమిటీ అని నన్ను అడిగితే .... నేను చెప్పడం కంటె మెదలకుండా వూరుకోవటమే మంచిది...." సత్యం అన్న ముక్కలు మననం చేసుకుంటూ సరోజిని తనలో తాను నవ్వుకుంటోంది. ఇట్టే శేఖర్ కనిపించాడు. "సరోజినీ, నేను నీతో నా మనస్సులో మాట ఎట్లా చెప్పాలో అర్థంకావటంలేదు. కానరాకుండా మిమ్మల్నిందర్నీ కష్ట పెట్టి అపార్థాలకు ఆస్కారం కల్పించి యీనాడు యేమీ తెలియని అమాయకుడులాగా నీ ముందర నిలబడాలంటే నాకు చాలా తలవంపులుగా వుంది. అయితే ఆ పరిస్థితు లేమిటో, నేను యెందుకు అట్లాచెయ్యవలసి వచ్చిందో నీకు పూర్తిగా చెప్పేశాను. .... బుద్ధిపూర్వకంగా చేసిన దానికి – పశ్చాత్తాపం లేదు.... ఇప్పుడు అయినా అంత కంటే నేను చెయ్యాల్సిం దేమిటో కనిపించటంలేదు. ... నామీద నీకు కలిగిన దురభిప్రాయం పోయిందంటే అదే నాకు చాలు .... తర్వాత నామీద నీకు ఎలాంటి అభి ప్రాయం కలగాలో నిర్ణయించుకోవల్సింది నువ్వే..."

శేఖర్ అన్నమాటలు చెవుల్లో మారుమోగుతున్నాయి. సరోజిని కళ్ళల్లో వలయాకారంలో సత్యం, శేఖర్, సుందరం, జ్యోతి గిరగిర తిరిగి పోతున్నారు. ఆమె తలకూడా గిర్రున తిరిగిపోతోంది. కళ్ళు గట్టిగా మూసుకుంది.

"అక్కయ్యా నా కళ్ళు తిరుగుతున్నాయి. నాకేమిటో భయంగా వుందీ... అన్నది వణుకుతూ.

"ఆఁ ! ....ఏమిటి....ఏమయింది... ఎట్లా వున్నావు... చెప్పు... మాట్లాడు సరోజిని ...." కళ్ళుతుడుచుకుంటూ చెల్లెల్ని పరామర్శించిది.

" ఏంలేదు ... ఏంలేదు .... సర్దుకుంటోందిలే ...." ఆయాస పడుతోంది. సరోజిని. జ్యోతి బిత్తర పోయి దిగాలు పడి చెల్లెలి వంకే చూస్తూ కూర్చుంది.

## 6

శారద రాత్రంతా ఒకటే కలవరింతలు. "అమ్మా నాన్నా" అంటూ లేచి కూర్చుంటోంది. సరోజిని యెంత సముదాయించినా శారద పంతంపట్టి ఏడుస్తూ కూర్చుంది. ఆ రాత్రి జ్యోతి వెళ్ళి ఆసుపత్రిలో పడుకుంది. తెల్లవారంగానే యింటికివచ్చేస్తుంది. వాసు కాఫీ తీసుకువెళుతాడు. కాని ఆనాడు తెల్లారటమే ప్రళయమనిపించింది. సరోజినికి. కంటిమీద కునుకులేదు "అదుగో కాకులు కూస్తున్నాయి. కోడి కొక్కొరకో అంటోంది వినిపించిందా ! ఇహ తెల్లారి పోయినట్టే అమ్మ వచ్చేస్తుంది. ఏడవకమరి ...." సరోజిని సతమతమయితోంది. భళ్ళున తెల్లారింది.

"అమ్మేదీ రాలేదే ...." అంటూ యిల్లంతా చూసింది శారద.

"ఇంకా రాలేదే పిన్నీ," అన్నాడు వాసు ఆరాటంగా.

"శారద గోలచేస్తోంది. ....నువ్వు చెల్లెల్ని తీసుకెళ్ళు....అక్కయ్యా వస్తుందిలే ... నువ్వు ఆలస్యం చెయ్యక ..." సరోజిని ఫ్లాస్కు అందించింది.

వాసు బిత్తరపోయి చూశాడు. నన్ను వెళ్ళమంటావా అన్నట్టు బిక్క మొహం వేసుకుని కూర్చున్నాడు. వాసుకు ఆసుపత్రంటే తగని

భయం. మరీ రెండు రోజులబట్టీ తండ్రిని చూస్తుంటే వంట్లోంచి వణుకు పుట్టుకొస్తోంది. పెరిగిన గడ్డం, పీక్కుపోయిన దవడలు, లోతుగా పోయిన కళ్ళు, పాలిపోయిన శరీరం తండ్రిని చూస్తుంటే నోట మాటలేంకుడాపో తోంది.

"పిన్ని రాగానే వెళతాను ..." అన్నాడు మళ్ళీ.

"లేదు వాసూ నీకు ! తెలీదు నువ్వెళ్లు ముందర .... అక్కయ్య వస్తుందిలే తర్వాత ..." అని పోరి పంపించింది. శారదను వెంటపెట్టుకుని వాసు గుమ్మందాటాడు.

అక్కయ్య యింకా రాలేదేమిటా?! అని సరోజిని పరిపరి విధాల ఆలోచిస్తోంది. చెడుతలపులు రానీయకుండా ఏమేమిటో వూహించు కోవటానికి ప్రయత్నిస్తుంటే అన్నీ చెడుభావాలే కలుగుతున్నాయి. హడలిపోతోంది. ఎటూ తోచటంలేదు. అమాంతం ఆసుపత్రికి వెళ్ళుదామని ఒక్క అంగ ముందుకు వేస్తుంది, మళ్ళీ యిట్టే వెనక్కి తగ్గుతుంది. చీటికి మాటికి వాకిటి గుమ్మం దగ్గరకు వెళ్ళి అక్కయ్య వస్తోందేమోనని చూస్తోంది. జ్యోతి జాడ తెలీటంలేదు.

"అత్తయ్యగారు యింకా రాలేదేమిటి...?!" శ్యామల మెల్లిగా సరోజిని దగ్గరకు వెళ్ళి అడిగింది.

అసలే తాను తీవ్రంగా ఆరాటపడుతోంది. ఎటూ విపరీతంగా బాధ పడుతోంది. శ్యామలవచ్చి అడుగుతుంటే మరింత జారిపోయింది. శ్యామలను ఓదారుస్తున్నట్లు పైకి మాట్లాడుతోందేకాని లోపల లోపల కుమిలిపోతోంది సరోజిని.

"వాసు వెళ్ళాడుగదా మాట్లాడుకుంటూ కూర్చున్నారేమో ! వస్తుందిలే ... నువ్వూరికే దిగులు పెట్టుకోక, వట్టిమనిషివి కూడా కాదు"

... సరోజిని నిబ్బరంగా అన్నది.

తళుక్కున ఏదో ఆలోచన మెరిసింది.

"బావగారితో చెపుతాను. శేఖర్ బావ నా కిష్టమేనని. ఆయన తప్ప కుండా కోలుకుంటారు. నా నోటి వెంబడి ఈ మాటలు వింటే అయనకు పూర్తిగా నయమవుతుంది. ఇంటికి వచ్చేస్తారు. ఇహ ఆలస్యం చెయ్య కూడదు ... శ్యామలా ..." బిగ్గరగా పిలిచింది.

శ్యామల దడుచుకుని ఉలిక్కిపడింది.

"ఏమిటి చిన్నత్తయ్యా...? మొహం చిట్లించుకుని గాభరాగా అడిగింది.

"ఏందలేదమ్మా ... ఏంలేదు ... బావగారు ... బావగారికి నయమవుతుంది. ... ఇదిగో యిప్పుడే నే ఆసుపత్రికి వెళుతున్నాను. ... నువ్వేం భయపడక..." తత్తర పడుతూ అటూ యిటూ చూస్తూ చకచక వాకిటి గుమ్మంవైపు ఓ అంగ వేసింది. వళ్ళు తూలింది. క్రిందపడబోయి గోడమీద బలంగా చెయ్యి ఆనిచ్చి బారగా ఆయాస పడుతోంది. శ్యామ లకు ఎటూ తోచక వీధిగడపదాటి యెవరైనా వస్తున్నారేమో చూస్తోంది.

అమాంతం ఒక్క క్షణంలో వాసు యింట్లోకి వచ్చేశాడు. నోట మాటలేదు. సరోజినివైపు చూస్తూ తెగ ఆయాసపడు తున్నాడు. సరోజిని యేమిటి అని కూడా అడగలేక పోయింది. ఆ గోడను అనుకుని జారి క్రిందపడిపోయింది.

"చిన్నత్తయ్యా ! ..." శ్యామల చెయ్యిపట్టుకుంది.

గుటగవేస్తూ గొంతు సవరించుకుంటూ వాసు యేదో చెప్పబో తున్నాడు. మాట పెగలిరావటంలేదు.

"... చిన్నబాబాయికి – ఫైరింగులో దెబ్బ — తగిలింది —

ఆపరేషన్ చేస్తున్నారు – హా" – హా – అంటూ కింద కూలబడ్డాడు.

"శేఖర్ –" సరోజిని నాలుకమీద ఆ అక్షరాలు అతుక్కుపోయి నాయి. కళ్ళార్పకుండా వాసు మొహంలోకి చూస్తోంది.

"వెళదాం రా మనం–" వాసు హడావిడి చేస్తున్నాడు.

"ఫైరింగ్‌లో – ఆ – శేఖర్–" సరోజినికి మతిపోయినట్లయిలది.

"వర్కర్స్ మిల్లులోకిపోయి మానేజింగ్ డైరెక్టర్ని కొట్టాలని ప్రయత్నం చేశారట – దౌర్జన్యాలు బాగా జరిగినాయట – పోలీసులు ఫైర్ చేశార్ట. చిన్న బాబాయి వర్కర్స్‌ను సర్దటానికి ప్రయత్నం చేస్తూంటే ఓ బుల్లెట్ మెడమీద కొచ్చి తగిలిందట – వర్కర్స్ ముగ్గురు అక్కడికక్కడే చచ్చిపోయార్ట. అంతా కన్‌ఫ్యూజన్‌గా వుంది – బాబాయికి ప్రమాదం లేదనే అంటున్నారు – మనం వెళదాంరా –" వాసు చివాలున లేచాడు.

ఇద్దరూ ఆసుపత్రికి వెళ్ళారు.

ఏక్సిడెంట్స్ వార్డ్‌లోకి చరచర వెళ్ళారు. నర్సులను డాక్టర్లను అడుగుతున్నారు. మాకు తెలీదంటే మాకు తెలీదని అంటున్నారు. ఆపరేషన్ థియేటర్ ముందు వెళ్ళి నిలబడ్డారు. అప్పుడే యిద్దరు నర్సులు ఓ వ్యక్తిని తీసుకుపోతున్నారు.

ఎవరూ అని అడగటానికి భయపడి అటువేపే చూస్తూ నిలబడి పోయారు.

అక్కడ వరండాలో అన్నీ ఎర్రటి గుడ్డలే. అటూ యిటూ పెద్ద పెద్ద అరుపులు కేకలు వినిపిస్తున్నాయి. అక్కడ చెట్లక్రింద కొంతమంది కూర్చుని శోకాలు పెడుతున్నారు. అంతా నానా బీభత్సంగా వుంది.

సరోజిని గదుల్లోకి చూస్తూ శేఖర్ ఎక్కడ అన్నట్టు వాసువంక చూస్తోంది.

వాసు ముందుకు వెళ్ళినట్టేవెళ్ళి యిట్టె గబగబ ప్రక్కకు తిరిగాడు

సరోజిని అక్కడే నిలబడిపోయింది.

"పాపం – ఎవరో లేబర్ ఆఫీసర్ట – మిల్లు ఫైరింగ్‌లో బాగానే దెబ్బ తగిలిందట– ప్రమాదంగా వుందంటున్నారు. ఆయన తల్లికి కబురు చేశార్ట. ఇంకా ఆమె రానేలేదు–అయన కింకా యెవ్వరూ లేనట్టున్నారు –" అని యెవరో అనుకుంటున్నారు.

సరోజిని భళ్ళున ఏడ్చింది. చప్పున అటూ యిటూ చూసి చీరె కొంగును నోట్లో కుక్కుకుని ఏడుపు పైకి రానీయకుండా చేసుకొవటానికి ప్రయత్నం చేస్తోంది. తలవంచుకుని చరచర సుందరం వున్న రూమ్ వైపు నడిచింది.

జ్యోతిని చూడంగానే అమాంతం కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. చెల్లెలి భుజంమీద చరుస్తూ మెల్లిగా లేవదీసింది. సరోజిని కళ్ళుతుడుచుకుంటూ, జుట్టును వేళ్ళతో పైకి సర్దుకుంటూ, చీరె కొంగును మెడకు చుట్టుకుని నింపాదిగా గదిలోకి వెళ్ళి నిలబడింది.

సుందరం మంచానికి అటూ యిటూ శారద, వాసులు తల పట్టెమీద ఆనించి కూర్చున్నారు. సుందరం కళ్ళు తెరిచి చూస్తున్నాడన్నమాటే గాని మాటాపలుకూ లేదు రాత్రి నుంచే ఆయన పరిస్థితి యేమీ బాగాలేదు. మన ధోరణే లేకుండా పోతోంది. కాని యెవ్వరూ అక్కడి నుంచి మాత్రం కదిల్లేదు. జ్యోతి కళ్ళను అద్దుకుంటూ ఒళ్ళో శారదను కూర్చోబెట్టుకుంది. శ్యామలా, వాసు యిద్దరూ గదిలో తూలుతూ కూర్చున్నారు. సరోజిని మనస్సువుతే ఆపరేషన్ థియేటర్ దగ్గరకు వెళుతూ వస్తోందేగాని ఆమె

మాత్రం ఆ గది తలుపుకు ఆనుకునే కూర్చుంది. సుందరం కళ్ళు తెరుస్తున్నాడు, మూస్తున్నాడేగాని కదలటంలేదు, మాట్లాడటంలేదు.

డాక్టర్లు వచ్చారు సుందిరం కంటిదగ్గర వేలు పెట్టి చూస్తుండగానే చల్లగా తగిలింది. ఆయన కళ్ళు అట్లాగే నిలిచిపోయినాయి. నర్స్ సుందిరం కప్పుకున్న దుప్పటిని మొహంమీద దాక లాగి వెళ్ళిపోయింది.

"నాన్నా!..." పెద్దపెట్టున ఏడుస్తూ వాసు తండ్రిమీద పడ్డాడు. గుండె బాదుకుంటూ కూలబడిపోయింది జ్యోతి. శారది అయోమయంగా పెద్దపెట్టున ఏడుస్తోంది. సరోజిని కళ్ళు ఎర్రబడ్డాయి. ఒకే ధారగా నీళ్ళు కారుతున్నాయి.

అటు నుంచీ యిటునుంచీ డాక్టర్లు నర్సులు హడావిడిగా తిరుగుతున్నారు. "డాక్టర్ కిశోర్‌దత్తు యెంతో ట్రై చేశారు మ్చ్ ... పాపం పూర్ శేఖర్ డెడ్ ..." సరోజినికి స్పష్టంగా వినపడ్డాయి. గబుక్కున వెనక్కు తిరిగింది. అప్పటికే ఆ మాటలు అన్న నర్స్ మలుపు తిరిగి యింకో వార్డ్‌లోకి వెళ్ళిపోయింది. సరోజిని తూలబోతూ తలుపు పట్టుకుని క్రింద చతికిలబడింది.

## 7

చిక్కటి చీకట్లు ఆవరించుకున్నాయి. ప్రపంచం అంతా నల్లటి కప్పేసుకుని విలయతాండవం చేస్తున్నట్లు కనిపిస్తోంది.

కాటుక చీకట్లను ఛేదించటానికి చిన్న చిన్న దీపాల్ని వెలిగిస్తూనే వుంటారు. అంతటి అంధకాంరంలోనూ మిణుకు మిణుకుమంటున్న దీపాల కాంతుల్లో వెలుగును చూడకలుగుతున్నారు. చీకట్లోంచి, వెలుగుల్లోంచి చీకటి వస్తూనేవుంది.

కాని జ్యోతికి ఒక్క చీకటే కనిపిస్తోంది. కళ్ళు విప్పుకుని

చూస్తున్నా అంతా అంధకారమయంగానే వుంది. మనస్సు దుఃఖంతో నిండి వుంది. హృదయభారం యెక్కువయింది. యెవ్వరితోనూ మాట్లాడదు. తెల్లారి లేచినప్పటినుంచి మూగ దానిలాగ యింట్లో తిరుగుతూ వుంటుంది. శారదవుతే తల్లి దగ్గరకు వెళ్ళటానికే భయపడుతోంది.

వాసుకూడా విషాదంగా విచారంగా యింట్లో ఓమూల తలపట్టుకుని కూర్చునే వాడే ! కాని అట్లా వీలులేదు. ఎన్నెన్నో వ్యవహారాలు చక్కదిద్దవాల్సి వచ్చింది. తన తండ్రి చేసిన అప్పులు విపరీతంగా పెరిగిపోయినట్లు యిప్పటికి గాని తెలియలేదు. ఆయన మంచంలో వున్నప్పుడు ఆస్తిపాస్తుల వివరాలు చెపుతానంటే వద్దని విదిలించుకుని వచ్చేశాడు. ఈనాడు తెలిసివచ్చాయి, సాధకబాధకాలు. వయస్సుకు మించిన వ్యవహారాలు పైన పడ్డాయి. లాయరు దగ్గరకు వెళ్ళటం, వచ్చిన నోటీసులకు సమాధానాలు యివ్వటం, కోర్టుచుట్టూ తిరగటం యిదీ వాసు కార్యక్రమం. ప్రాణం విసిగిపోతోంది. పోయిన డబ్బుపోగా, యింకా బోలెడంత డబ్బు ఖర్చవుతోంది. ఇదంతా జ్యోతి మూలానే అనే భావన కలిగి నప్పుడు ఆమెమీద వున్న జాలి కాస్తా పోయి అసహ్యం యేర్పడుతోంది.

సరోజిని వెళ్ళిపోదామనుకొని కూడా తీరా బావగారు పోగానే ఆ పుట్టెడు దుఃఖంలోవున్న అప్పను వదిలిపెట్టి వెళ్ళిపోయింది, అనుకుంటారేమో ననే భయంతో యిక్కడే వున్నది. అక్కయ్య మనస్సు మరలుద్దామని ఎంత ప్రయత్నంచేసినా కుదరటంలేదు. జ్యోతి అసలు మాట్లాడటమే మానేసింది. ఇంత దిగులు పెట్టుకుంటే ముందు ముందు యెట్లా జీవితం గడపగలదా అని సరోజిని అట్టే దిగులు పడుతూవుంటుంది. ఈ బాధతో పాటు శేఖర్ దారుణ మరణాన్ని గురించి తలుచుకున్నప్పుడల్లా మరింత వ్యథ పడుతుంది. అతనికి తన యిష్టాన్ని తెలిపి వుంటే అతని ఆత్మనాన్ని శాంతపడేది అనుకుంటుంది.

సుందరం పోయినప్పటి నుంచీ సత్యం తరుచు వస్తూవుంటాడు. అందులో శ్యామలంటే అమితమైన ఆప్యాయత. సూచనగా ఆ నోటా ఆ నోటా విన్నాడు, సరోజినిని గురించి. ఆమె శేఖర్‌ని ప్రేమించిందని పెళ్ళి కూడా నిశ్చయమయిందని, యీలోగా యీ అవాంతరం వచ్చిందని గూడా కొంతమంది అనగా విన్నాడు. దీంట్లో ఏవి యెంతవరకు నిజాలో సత్యాని కవుతే తెలియదు. అయినా అతనిలో మార్పు వచ్చినమాటవుతే నిజమే. సరోజినిని చూస్తుండే ఒక్క క్షణం భయపడినట్టు నిశ్చేష్టుడై పోతాడు. మళ్ళీ యేదైనా మాటాడుదా మనుకుంటాడు. అయినా తనకూ ఆమెకు యేం సంబంధమని విరక్తిగా వుండిపోతాడు, వాసును పలకరించినా పలికేస్థితిలో లేడు.

తన యిల్లు వేలం వేస్తున్నట్లు, ఎవరో ఆ యింటిని కొనేసి స్వాధీనం చేసుకొంటున్నట్టు ఊహించుకుంటున్నాడు. ఈ వారంలో డబ్బుకట్టకపోతే అంత పనీ అవుతుంది. ఆ యిల్లు అతనికి దక్కదు. ఎంత ప్రయత్నం చేసినా డబ్బు అప్పు యిచ్చేవాళ్లెవరూ కనబడటంలేదు. పొలం పోయినా ఎవరూ దిగులుపడటం లేదుగాని అయిల్లు పోతేమాత్రం అందరి మనస్సులు చివుక్కుమంటాయి. ఆయింట్లో యెక్కడో మారుమూల సుందరం పడుకుని వున్నట్టే అనిపిస్తూ వుంటుంది. ప్రతిరోజూ ఒక్కసారయినా సరే ఆయన రూపు అందరి కళ్ళల్లోనూ మెసులుతుంది. ఆయన కూడ తిరుగుతున్నట్టుగానే వుంది.

"స్నేహితులు బంధువులు డబ్బున్నప్పుడు కొల్లలు కొల్లలుగా కనిపిస్తూనే వుంటారు, అవసరం వచ్చినప్పుడే ఆదుకోవాలి. ఈనాడు శ్యామల యిల్లు వేలాం వేస్తారని తెలిసికూడా యేమీ చెయ్యలేని అశక్తతతో వుండే నిస్సహాయత నాకేమీ లేదు. ఇలాంటి సమయంలో నేను చెయ్యగలిగినది చెయ్యటం నాకుసంతృప్తి, సంతోషం. నువ్వు యింకోవిధంగా భావించవద్దు.

అప్పుగానే తీసుకుని నీ వీలున్నప్పుడు తీర్చేద్దుగాని ..." అన్నాడు, వాసును కూర్చోబెట్టుకుని సత్యం.

సరోజిని ప్రక్క ప్రక్కనే నిలబడి అంతా విన్నది. తనకూ సంతోషమే. ఇహ యీ యిల్లు మనదికాదు అనే సమయానికి మనదే అని ధైర్యం యిచ్చినవాడు సత్యం. అతని మీద అపారమైన ప్రేమ, గౌరవము కలిగినాయి. అక్కడ వుండలేకపోయింది ఒక్కక్షణం కూడా.

"మీరు యీ సమయానికి ఆదుకోకపోతే వాసు యెంత యిదయిపోయేవాడో. ఈ సహాయాన్ని మేము జన్మ జన్మలా మరిచిపోలేము ..." ఆవేశంగా అన్నది సరోజిని.

"మా శ్యామల యిల్లు నిలబెడదామనుకున్నాను. నిలబెట్టాల్సిన బాధ్యత కూడా నామీద వుంది. బాధ్యతను నిర్వర్తించి ఎవరికో యేదో ఉపకారం చేశాననే అపోహలో నేనెప్పుడూ వుండను ..." సత్యంకూడా ఆవేశంగానే అన్నాడు.

జ్యోతి కళ్ళనీళ్లు తుడుచుకుంటూ ఏమనాలో తెలీక – మెదలకుండా వుండిపోయింది.

ఇల్లు వేలం అయితే ఆగిపోయింది, కాని యింకా యెంతైనా డబ్బు కావాలని మధనపడుతున్నాడు, వాసు. అయితే సరోజిని యిస్తున్న ధైర్యం తనని యెన్ని సమస్యలనైనా ఎదుర్కొనిస్తోంది. ఆత్మవిశ్వాసం బాగా వచ్చేసింది. ఇహ వాసు ఆలోచనలన్నీ సత్యం, సరోజినిలమీదకు మళ్ళాయి. సత్యంతో చనువుగా మాట్లాడినప్పుడు అతని మనస్సు తెలుసుకున్నాడు. చిన్న పిన్నికి అభ్యంతరం యేమీ వుండదు. అయినా యీ విషయం పిన్నితోయెట్లా మాట్లాడటం. ఏమనుకుంటుందో ! రకరకాలగా వూహించుకుంటూ మెల్లిగా సరోజిని దగ్గరకు వెళ్ళాడు. వాసు మొహం

లోకి చూస్తూనే బిడియ పడ్డట్లు తలవంచుకుంది సరోజిని. తాను చెప్ప దలచుకున్న విషయం అతనితో యెట్లా చెప్పటం అని మధనపడుతోంది.

"ఏమిటి పిన్నీ మాట్లాడవు ..." మామూలుగా చనువుగానే అన్నాడు.

తలపైకెత్తి ఒక్క క్షణం వాసు కళ్ళల్లోకి చూసింది.

"ఏంలేదు... మేము ఎల్లుండి తిరుపతికి వెళుతున్నాం..." ముక్త సరిగా అని వూరుకుంది.

"అంటే ..." కనుబొమలు దగ్గరగా రానిచ్చి ఆలోచనగా చూశాడు.

"అదేనయ్యా ... నీకు తెలిసిందేగా ... తిరిపతివెళ్ళి 'పెళ్ళి'..." అంటూ నవ్వూ సిగ్గూ మేళవించింది.

వాసు కళ్లు పెద్దవయినాయి.

"పిన్నీ ! ... అంటూ" ఆవేశంగా పిలిచాడు, సంతోషం పట్టలేక పోయాడు.

"శ్యామలా !"... అంటూ గభాలున భార్య దగ్గరకు వెళ్ళాడు. తొట్లో పిల్లవాడు ఊగుతూవుంటే చూసివారందరూ అచ్చంగా సుందరం గారే అన్నారు. వాసుకు తన తండ్రి ఆ పసిపాపలో కనిపిస్తున్నాడు జ్యోతికి ఆ పిల్లాడ్ని చూసినప్పుడల్లా ఒళ్ళు ఝల్లుమంటుంది. తొట్టెమంచంలో చిన్న చిన్న చేతులు చిన్న చిన్న కాళ్ళూ కదిలిస్తూ అటూ యిటూ ఆడి పోతూవుంటే ఆ పిల్లాడ్ని అట్లాగే చూస్తూ ఎంత సేపయినా నుంచోగలదు. ఆరాటం, ఆవేదన తగ్గినట్లు అనిపిస్తూ వుంటుంది. కాని శ్యామల ఒక్క నిమిషం సహించదు. జ్యోతి తొట్టెదగ్గరకు రావటం చూసిందంటే చాలు,

పసిపాపను చేతుల్లోకి తీసుకుని గబ గబ అక్కడ నుండి వెళ్ళిపోతుంది. జ్యోతి తలవంచుకుని మెదిలకండా వూరుకుంటుంది. శారదవుతే వాసు దగ్గర అతిగారాబం చేస్తుంది. వాసు ఆ అమ్మాయి చెప్పినట్లే చేస్తూ వుంటాడు. ప్రతి చిన్న విషయానికి వదినా వదినా అంటూ శ్యామల దగ్గరకు వెళుతుంది గాని తల్లిపంచన వుండదు. వాసవుతే యెంతో అవసరం అయితే గాని జ్యోతితో మాట్లాడడు. ఆమె ఆ యింట్లో ఒంటరిగానే వున్నట్లుగా ఎబ్బెట్టుగా వున్నది. పలకరించేవారే కనబడటంలేదు. సరోజిని పెళ్ళవంగానే వెళ్ళి పోయింది. జ్యోతికి కాలక్షేపం అసలు లేకుండా పోయింది. గతాన్నంతా నెమరువేసుకుంటూ ఎంతసేపైనా అట్లాగేకూర్చుని వుంటుంది. రాను రాను తనమూలాన వాసూ, భార్య పోట్లాడుకుంటున్నట్లు గ్రహించింది. ఎప్పుడో ఒకప్పుడు ఏదో సమయంలో భార్యను అంటాడు, పోనీలే పిల్లాడ్ని మా పిన్ని యెత్తుకుంటే కాదంటం యెందుకులే అని. దాంతో శ్యామల రెచ్చిపోతుంది. అసలు ఆవిడగారు మనపిల్లాడ్ని ముట్టుకోవటం కూడా మంచిది కాదని, శ్యామల భర్తకు గట్టిగా చెప్పింది. వాసు మారు మాట్లాడలేదు. మొత్తం మీద ఆ యింట్లో శ్యామల మాట సాగాల్సిందే గాని యింకోళ్లెవరూ నోరెత్తి గెలవలేరు.

ఆనాడు పెళ్ళిపీటలమీద గువ్వలాగ కూర్చున్న శ్యామల యీనాడు నెమలిలాగ నాట్యం చేస్తోంది. జ్యోతి పూర్తిగా గ్రహించింది. ఇహ రేపో మాపో వేరే వుండమని కూడా వాసును పురమాయిస్తుంది. ఆమాట వాళ్ళ చేత అనిపించుకుని విడిపోవడం కంటే తనంతట తానే ఆముక్క వాసుతో చెపితే బాగుంటుందని జ్యోతి బాగా ఆలోచించి ఆలోచించి వాసును పిలిచింది, శ్యామల యింట్లో లేని సమయం చూసి.

"వాసూ ... జరిగిందేదో జరిగిపోయింది. మా మూలాన నువ్వూ శ్యామల కీచులాడుకోవటం ఏం బాగాలేదు. ఆ అమ్మాయి మనస్సు

కష్టపెట్టి నువ్వు బాధ పడుతుంటే నాకు మాత్రం సుఖమా... వుంటానికి నీడయిచ్చి పోయారుగా మీ నాన్నగారు. నేనూ, శారద యీ భాగంలో వుంటాం, మీరుయిక్కడే వుండండి. వున్నదాంట్లోనే సర్దుకుంటాం. తప్పేముంది..." చాలా సాత్వికంగా నిదానంగా చెప్పింది జ్యోతి.

వాసు విని వూరుకున్నాడు. శ్యామల పోరు యీ మధ్యనే యెక్కువయింది కూడా. వాళ్ళ మూలాన ఖర్చులు మనకు జాస్తి అవుతున్నాయని. అదీ నిజమే ఇదీ గుంభనగానే జరుగుతుంది. పిన్ని అనటంమూలాన విడిగా వుంటున్నాం గాని శ్యామల వలన కాదు. ఇదీ ఒకందుకు మంచిదే. ఆ నిమిషంలో యెన్నెన్నో ఆలోచించి 'సరే నీయిష్టం' అని వెళ్ళిపోయాడు.

వారం రోజుల్లో అడ్డుగోడ యింటిని రెండుగా చీల్చింది. రెండు కుటుంబాలయ్యారు. విడి విడిగా వుంటున్నారు.

పదిగంటకల్లా శారద అన్నంతిని బళ్ళోకి వెళితే మళ్ళీ సాయంత్రం నాలుగింటిదాకా రాదు. జ్యోతి ఆ ఇంట్లో ఒంటరిగా బిక్కు బిక్కుమంటూ కూర్చుంటుంది. ఒంటరిగా అదేపనిగా కూర్చునే టప్పటికి పిచ్చి పిచ్చి ఆలోచనలు రావటం గతం జ్ఞాపకం వచ్చి దుఃఖపడటం. ఇవే జరుగుతున్నాయి. ఒంటరి తనాన్ని భరించటం మహా కష్టంగా వుంది. అందుకనే ఒక్కొక్కప్పుడు శారదని బడి మాన్పించి ఇంట్లోనే కూర్చోపెట్టుకుంటుంది. వాసు యెప్పుడైనా వచ్చి తొంగి చూసి పోతూ వుంటాడు. శ్యామలను చూస్తేచాలు జ్యోతికి వెన్నులోంచి వణుకుపుట్టుకొస్తూ వుంటోంది. శ్యామల నోటికి జ్యోతి గజగజలాడుతూ వుంటుంది. ఎంతమాట పడితే అంతమాట అనేస్తుంది. జ్యోతి అలాంటి మాటలను భరించలేదు. సరోజిని వచ్చి ఆప్యాయంగా తనింటికి రమ్మనమన్నా, ళ్లిలు కదిలదు. తానే కాసేపు కూర్చుని వెళ్ళిపోతూ వుంటుంది.

మళ్ళీ సంక్రాంతి వచ్చింది. అయివేజు లెక్కచెప్పి జ్యోతికి రావలసిన డబ్బు యిచ్చేశాడు. వాసు దాంట్లోనే ఆ ఏడంతా గడుపుకోవాలి. వాసు వాటా బాగానే వుంది. డబ్బు ఆడుతూనేవుంది. కాని అతనికి స్వాతంత్రం లేదు. శ్యామల యెంతచెపితే అంతే! ఆమె చెప్పాలి తాను వినాలి అనే పద్ధతికి పూర్తిగా అలవాటు పడ్డాడు. సరోజినికి కూడా చాలా ఆశ్చర్యం వేసింది. వాసు యింత యిదిగా మారిపోతాడని ఊహించలేక పోయింది. అదివరకల్లా కాస్తో కూస్తో డబ్బిస్తూ వుండేవాడు. ఈ ఏడాది నుంచి వాసు యివ్వటం మానేశాడు. ఖచ్చితంగా యివ్వవద్దని భార్య చెప్పింది. పంటడబ్బుతో గడుపుకోవడం చాలా కష్టంగానే వుంది. దాంతో జ్యోతి జీవితం గడపటం దుర్భరమయిపోతోంది. అతి గుంభనగా గోప్యంగా గడుపుకుంటోంది. ఎవరేమిచ్చినా తీసుకోదు, ఇతరులను యేమీ అడగదు, జ్యోతి కూడా పూర్తిగా మారిపోయింది.

ఆనాడు బళ్ళోనుంచి వస్తూనే అన్నయ్యా నీకోమాట చెపుతానంటూ వాసు దగ్గరకు వెళ్ళింది, శారద.

శారద తొడుక్కున్న గౌనుకు రెండు మూడుచోట్ల చిల్లులు కనిపించినాయి. కట్టుకున్న వరికిణీ మీద అతుకులు స్పష్టంగా కనిపిస్తూనే వున్నాయి.

వాసు దిగాలుపడి దుస్తుల్ని చూస్తూ, "నువ్వు బళ్ళోంచేనా రావటం" అన్నాడు.

"అవును బళ్ళోంచే యెందుకు..." వయ్యారంగా అన్నది శారద. "మా అమ్మ యివే తొడుక్కుని వెళ్ళమంది... అయినా నాకు పెట్టెలో యింకా లేవుగా మరి"... బిక్క మొహం వేసుకుని శారద వాసు వంక చూసింది.

"పిచ్చిపిల్లా;..." అంటూ వాసు శారదను దగ్గరకు తీసుకున్నాడు.

ఇంతలోకి శ్యామల లోపల్నుంచి వస్తూనే "శారదెప్పుడొచ్చింది" అన్నది.

"ఇప్పుడే వచ్చా వదినా... నాకు ఫస్టుమార్కు వచ్చింది ... అది చెప్పటానికే వచ్చా..." ఎంతో సంబరంగా అన్నది.

"అట్లాగా అయితే నీకు మైసూరుపాకం పెడతా రా" అంటూ శారదను లోపలికి తీసుకు వెళ్ళింది.

కాసేపటికి వాసు, శారదా యిద్దరూ బజారు వెళ్ళారు. చెల్లెలికి రెండు జతల బట్టలు కొని యింటికి తీసుకువచ్చాడు.

వస్తూ వస్తూనే "అమ్మా అమ్మా నా పరికిణి యెంత బాగుందో చూడవే" అంటూ మురిసిపోయింది.

ప్రక్కనే నిలబడ్డ వాసునిచూసి జ్యోతి యేమి మాట్లాడలేదు.

"పిన్నీ చెల్లెలికి ఫస్టుమార్కు వచ్చిందట, అందుకని యీ బహుమానం..." నవ్వుతూ అన్నాడు వాసు.

శారద చినిగిపోయిన బట్టలు చూసి కొని పెట్టాడని అనుకుంది జ్యోతి. అయినా తప్పేముంది దీంట్లో. చెల్లెలికి అన్నయ్య కానుకలు యివ్వటం సహజమేగా అని సమాధానపడింది.

ఓ సారి వాసు శారదకు రెండుజతల బట్టలు కొంటేనూ శ్యామలకు తెలీకండా అరబస్తా బియ్యం పంపుతేనూ సరిపోదుకదా ; నిత్యకృత్యం ఎన్నో ఖర్చులు వుంటూనే వుంటాయి. వాటన్నింటిని తట్టుకోవాలంటే జ్యోతికి తన శక్తికి మించిన పనే అవుతోంది. ఏం చెయ్యాలో అర్థంకాక తికమకపడుతోంది. రకరకాల ఆలోచనలు వస్తున్నాయి.

అయితే ఫలానా అని నిర్ణయించుకో లేకపోతోంది. కాలచక్రం గిర్రున తిరిగిపోతూవుంటే స్తబ్దురాలయి వున్న చోటునుంచి కదలలేక పోతోంది. కాలంతో పరుగెత్తటానికి మనిషికి మనస్సుండాలి, బలం వుండాలి, శక్తీవుండాలి, ఉత్సాహం కావాలి. ఇవన్నీ ఒకప్పుడు పుష్కలంగా వుండేవి. అప్పుడు కాలగమనాన్నే గుర్తించేది కాదు. తెల తెల వారకమునుపేలేచి కాలంతో పోటీ పడ్డట్టు గిర్రున తిరుగుతూ వుండేది. ఇప్పుడన్నీ ఉడిగిపోయినాయి. ఏమీచెయ్యలేని అశక్తత పూర్తిగా ఆమెలో జీర్ణించుకుపోయింది. రోజు రోజుకుఆమెకు పగ కసి అహంకారం కోపం యెక్కువయిపోతున్నాయి. కాని యెవ్వరిమీద చూపించాలో అర్థంకావట లేదు. తన కోపానికి తన తాపానికీ చిరాకుకు విసుగుకు అన్నింటికీ ఒదిగి ఒదిగి వున్న వ్యక్తి వెళ్ళిపోయాడు. ముందు ముందు ఎట్లా కాలం వెళ్ళబుచ్చుతానా అనే అధైర్యం యేర్పడింది. పిరికితనం బాగా వచ్చేసింది.

కాని యిట్లా నిస్పృహ పడిపోతే లాభంలేదు. తనకు యింకా ఓ బాధ్యత వుంది. శారదను ఓ యింటిదాన్ని చెయ్యాలి. దానికోసమైనా నిబ్బరంగా వుండాలి. ఉత్సాహం తెచ్చుకోవాలి. ఓపిక వున్నట్లు ప్రవర్తించాలి. నే పడ్డ మానసిక సంక్షోభం అమ్మాయికి రాకూడదు. నాకు అందరూ వున్నా అందర్నీ నేనే పోగొట్టుకున్నాను. ఇప్పుడు నాకెవ్వరూ లేరు. నాకు ఒకరి దయాదాక్షిణ్యాలు అక్కర్లేదు. నేను చేసిన దానికి యీ ఒంటరిగా అనుభవించటమే నాకు పెద్ద శిక్ష. జ్యోతి మనస్సులో తెగ ఆరాట పడుతోంది. ఆవేశం ఉద్రేకం యెక్కువయి పోతున్నాయి.

వాకిటి గుమ్మం ముందు ఎవరో నిలబడ్డట్టుగా ఆలికిడయి 'ఎవరూ" అని మెల్లిగా అన్నది.

"నేనేనమ్మా... జాకెట్టు తెచ్చాను. పరికిణీ కూడా కుట్టేశాను...

ఇవిగో...మొత్తం ఎనిమిదిన్నర అయిందండి"...అన్నది బట్టలుఅందిస్తూ

వీటికి ఎనిమిదన్నరా? అని తనలో తాను రెండు సార్లు గుణించుకుంది. మొహం చిట్లించుకుని ఆశ్చర్యపోయినట్లు ఆమెవంక చూసింది. కళ్ళుమూస్తూ తెరుస్తూ తలవిదిలించేసుకుని గబగబ లోపలికి వెళ్ళి డబ్బు తెచ్చియిచ్చింది. సతోషంగా నవ్వుతూ, ఆమె మొహం కూడా విప్పారింది. జ్యోతి ఆనాడల్లా యెంతో ఆనందంగానూ హాయిగానూ గడుపుతుంటే శారదకు అర్థంకాలేదు. అమ్మలో హఠాత్తుగా యింత మార్పు రావటానికి కారణం యేమిటా అని అనుకుందేగాని తను అడగనూలేదు, ఆమె చెప్పనూ లేదు.

"అమ్మా ... నేనోమాట చెప్పనా ..." భయపడుతున్నట్లుగా తల్లివంక చూసింది.

జ్యోతి నవ్వింది. శారదకు ధైర్యం వచ్చింది.

"పిన్ని కనిపించింది నన్ను వాళ్ళింటికి రమ్మన్నది. ఎన్నిసార్లు పిలిచినా మనం వాళ్ళింటికి వెళ్ళటం లేదుగా. బాగా కోపం వచ్చినట్టు మాట్లాడింది. మనం వాళ్ళింటికి వెళితే యేం..."

"ఏంలేదమ్మా వెళ్ళొచ్చు. మీ పిన్ని మనింట్లో వున్నన్నాళ్ళు ఎలా వుందో నాకు తెలుసు ... అవన్నీ యిప్పుడెందుకులే, నాకు అక్కడికి వెళ్ళటానికి మాత్రం మొహం చెల్లదు, నేను రాను ..."

"పోనీ నే వెళ్ళనా...."

"ఊఁ ! ..."

శారద ఉత్సాహంతో తల్లిని చుట్టేసుకుని మా 'అమ్మ' చాలా మంచిదని తల్లి చుట్టూ గిరగిర తిరిగింది. శారద నిమిషాలమీద సరోజినింటికి వెళ్ళింది.

జ్యోతి గది గుమ్మందాకా వెళ్ళి మెల్లిగా "అమ్మా శ్యామలా వాసున్నాడా యింట్లో" అన్నది.

"ఇంట్లో లేరండీ ... అయనతో యేంపని .... నాతో చెప్పండి విషయం యేమిటో ..." శ్యామల అవతల్నుంచి బిగ్గరగా అరిచింది.

"ఏంలేదమ్మా ... నీతో చెప్పరాని రహస్యం యేమీ లేదు ..." అంటూండగానే వాసు రానేవచ్చాడు.

ఇంత మొహం చేసుకొని "వాసూ నాకోసహాయం చేసిపెడతావా?" అన్నది.

వాసు చప్పున నిలిచిపోయాడు.

"ఏం లేదు ... ఆ పంట డబ్బుతో నాకో కుట్టుమిషను కొని తీసుకురా ..."

"కుట్టుమిషనా? ..." ఆశ్చర్యపోయాడు.

ఆమె మొహంలోకి చూస్తూ "ఎందుకిప్పుడు" అన్నాడు.

"నాకు బొత్తిగా కాలక్షేపం కావటంలేదు..."

"కాదు పిన్నీ కాదు నాతో చెప్పు ... కుట్టుమిషన్ యెందుకడిగావో చెప్పు ... నీ ఉద్దేశమేమిటో చెప్పు ..." వాసు రెట్టించి అడిగాడు.

"కుట్టుమిషన్‌తో యేంచేసుకుంటారు చెప్పు..."

"అంతేనా ... "

వాసు గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు.

మర్నాడే కుట్టుమిషన్ యింటికి వచ్చేసింది. "అమ్మా నే కూడా నేర్చుకుంటానే" శారద ఉబలాటపడింది.

"వేసంగిశలవల్లో నేర్చుకుందుగాన్లే. నీ పరీక్షల సంగతేమిటో చూసుకో ముందర ... అని జ్యోతే అతి శ్రద్ధగా కూర్చుని మెళకువలన్నీ తెలుసుకొంది.

ఇహ మిషన్ గిరగిర తిరుగుతూనే వుంది పెద్దపెద్ద చప్పుడుచేస్తూ ఒకావేళా లేదు. పాళాలేదు. ఎప్పుడు తీరుబడివుండే అప్పుడే బట్టలుకుట్టటం అలవాటు చేసుకుంది. శారద బళ్లోకి వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు యిళ్ళకు వెళ్ళి బట్టలు తీసుకురావటం కుట్టినవి తీసుకెళ్లటం యిదో సరదాగావే వుంది. జ్యోతికీ బాగా కాలక్షేపం అవుతోంది. డబ్బు వస్తూనే వుంది. మొదట్లో శ్రమఅనిపించిన రానురాను యేమంత కష్టమయిన పనికాదులే అనిపించింది.

మిషన్ తిరిగినప్పుడల్లా శ్యామల రుసరుసలాడుతూనే వుంటుంది ఏమటి చెవి కింద యీ గోల అని. ఓసారి గట్టిగానే అన్నది వేళాపాళా లేకుండా యేమిటండీ యిది, మేం యీ యింట్లో వుండాలా యెక్కడికైనా వెళ్ళిపొమ్మంటారా అని.

జ్యోతి కుట్టుతున్న మిషన్ చప్పున ఆపేసింది. శ్యామల అన్న ముక్కలే రెండు సార్లు మననం చేసుకుంది. శారద ఒకటి రెండు సార్లు అన్నది కూడా వాళ్ళ స్కూలు దగ్గరే చిన్న యిల్లుందిట, అక్కడ కనక వెళ్ళి వుంటే బోలెడు బట్టలొస్తాయి అని. ఇప్పుడు యిక్కడ యిళ్ళఅద్దెలు కూడాయెక్కువ గానే వున్నాయి, అన్నివిధాలా మనకు లాభమే. చప్పున ఓ నిర్ణయం తీసుకుంది. శారద రాంగానే చెప్పసింది. మనం మీ స్కూలు దగర యింట్లోకి వెళదాం. నీకు దగ్గరవుతుంది. అద్దెంతో యేమిటో వివ రాలు కనుక్కొనిరా అని.

ఆనాడు పొద్దున్నే వాసు దగ్గరకు వెళ్ళింది జ్యోతి.

"... మేం యిక్కడి నుంచి వెళదామనుకుంటున్నాం ... శారద

స్కూలు దగ్గరే ఓచిన్న యిల్లుంది. రెండు గదులు. నేనూ అమ్మాయేగా మాకు సరిపోతుంది ... అద్దెకూడా చాలా తక్కువే, యిరవై రూపాయలు ... ఈ యింటికేమో హెడ్ గుమస్తా గారొస్తానన్నారు. వందరూపాయలు అద్దె వస్తుంది ... ఎల్లుండి ఆదివారం వెళదామని ..." జ్యోతి వాసు మొహంలోకి చూసింది.

"ఏమిటీ పిన్నీ నువ్వెళ్ళి యెక్కడో వుంటవా! ...

"నేను యే వూరు వెళుతున్నానని! ..." జ్యోతి విషాదంగా నవ్వింది.

"నాకేమి అర్థం కావటంలేదు. ఈ యిల్లు అద్దెకిస్తావా? ..."

... అవును మేము యిచ్చే అద్దె పోనునెలకు ఎనభై రూపాయలు వస్తాయి - పిల్లకూ బడిదగ్గర ... ఇదంతా ఆలోచించే చెపుతున్నా —"

"నీకిక్కడ కష్టంగావుందా పిన్నీ —" అతిపేలవంగా అన్నాడు వాసు.

"నాకింకా కష్టమేమిటి సుఖమేమిటి —" తలవంచుకుంది జ్యోతి.

## 9

సరోజని చాలా బాధపడుతోంది. అక్కయ్య తీరా శ్రమపడి సంపాదిస్తే గాని రోజులు గడవని పరిస్థితి యేర్పడిందే అని మనస్సు బాగా క్రుంగిపోయింది. బట్టలు కుట్టుకుని జీవితం గడుపుతోందా యెంతదుస్థితికి దిగజారి పోయింది, దుఃఖము పొర్లుకొచ్చింది. అన్నీ చూస్తూకూడా తానేమీ చెయ్యలేని పరిస్థితిలో వున్నది. తన మాట వినదు, ఆమెకు యెంతతోస్తే

అంతే. శారద పెళ్ళి విషయంలో బాగా దిగులు పెట్టుకుంది. దాని కోసమే యీ పాట్లన్నీ పడటం. అవును నిజమే ఒకపూట, ఒకరోజు అయితే యెవరైనా తీసుకెళతారు ఆదరిస్తారు. రోజూ యెవరు తీసుకెళతారు ? పోషిస్తారు? అక్క అన్నమాట నిజమే. ఏదో మనస్సు ఆపుకోలేక అనుకోవటమే గాని, పోనీ నాలుగు రోజులపాటు నాదగ్గరుందుగాని రమ్మనమన్నా రాదు! "నేను ఫలానా అనితెలియటం మీకు గౌరవం కాదమ్మా, మీయింటికి రాకపోతే మాత్రం నేను నీఅక్కను కాకపోతానా నవ్వు నా చెల్లెలివి కాకపోతావా" అబ్బ ఎంతమాటన్నది. ఆమె అభిమానం యేమిటో ఆమె ధోరణేమిటో నాకర్థం కావటంలేదు. అక్కకు నేను యేవిధంగా తోడ్పడాలో నాకే తెలియటం లేదు. అక్కడ అక్క అంత కష్టపడి మనోవేదన పడుతుంటే మేము యీవూళ్ళోనేవుంటూ ఆమెకు సహాయపడలేని నిస్సహాయతలోనూ అసమర్థతలోనూ వుండాల్సివస్తోంది. తలొక వూళ్ళోవున్నా యింత మానసికబాధ వుండేదికాదు. సరోజిని జ్యోతిని గురించి యెప్పుడు తలుచుకున్నా యిలాంటి ఆలోచనలే వస్తూవుంటాయి. హృదయం బరువెక్కుతుంది. కళ్ళల్లో నీళ్ళు నిండుకుంటాయి. రేవు భారసాలకు వచ్చినప్పుడన్నా పట్టుపట్టి పదిరోజులైనా వుండమని గట్టిగా చెప్పాలి. ఎందుకు వుండదో చూస్తాను అనుకుంది.

"అక్కా! పాపకు పేరుపెడుతున్నాం రేపు. తప్పక రావాలి. ఏదో సాకు చెప్పి తప్పించుకోవద్దు, ఎన్నిసార్లు పిలిచినా నువ్వు గుమ్మం కదల్లేదు —" గట్టిగా అన్నది.

"తప్పక వస్తాను ఎందుకురాను —" జ్యోతి మామూలుగా అనేసింది, ఇలాంటి సమయంలో కూడా వెళ్ళకపోతే మూర్ఖంగా వుంటుందని.

సరోజిని యిల్లు కళకళ లాడుతోంది. నలుగురూ వచ్చి కూర్చున్నారు.

"బారసాల ఓ పెద్ద ప్రమేయంగా పెట్టుకోలేదు — ఏ కారణం లేకుండా మా యింటికి రమ్మనమనటం మా కెంత యిరకాటంగా వుంటుందో వచ్చేవాళ్ళకు కూడా అంత మొహమాటంగా వుంటుంది. ముఖ్యంగా జ్యోతి వదినగార్ని రప్పించగలిగాం. అదే మాకు చాలా సంతోషం —" అన్నాడు సత్యం.

జ్యోతి గతుక్కుమన్నది. నలుగుర్లోను, తన విషయం మాట్లాడటం యేమంత బాగా అనిపించలేదు. అయితే తన మీద అంత అపారమైన గౌరవం, అభిమానం వున్నాయని మాత్రం తెలుసుకోగలిగింది. అదే అమెకు మిగిలిన తృప్తి. కాని తన మీద యెవరైనా జాలిపడుతున్నట్లుగాని తనకు సహాయం చేస్తానంటే గాని యెన్నటికీ ఒప్పుకోదు. వాళ్ళకు చాలా దూరంలో వుండిపోతుంది. ఆ పట్టుదల మాత్రం యింకా బిగువుగానేవుంది. అందువల్లనే అటు సరోజిని యింటికి వెళ్ళటంలేదు. ఇటు వాసు కుటుంబం తోనూ అంతంత యెడంగానే వుంటోంది. ఈనాడు కేవలం పాపను చూట్టానికని వచ్చింది.

లోపల తర్జన భర్జన పడుతున్నారు. పేరు యేం పెట్టాలా అని. సరోజిని కవుతే తనతండ్రి పేరు పెట్టాలని గట్టిగా వుంది. ఆముక్క పైకంటె సత్యం కూడా తన తండ్రిపేరే పెట్టాలని పట్టుబడితే! అందుకనే మెదల కుండా వూరుకుంది. ఆ ప్రస్తావన తీసుకు రావటం లేదు. సత్యమవుతే తన కేమీ పట్టనట్టుగా ముభావంగా వూరుకున్నాడు. దాంతో మరీ ఆరాటం యెక్కువయిపోతోంది.

"దీనికింత ఆలోచనెందుకు, ఆవేళ్టికి ఏదితోస్తే అదే అనేద్దాం. వాడు పెద్దవాడయి మన పేరు నిలబెడతాడో లేదో యెవరికి తెలుసు..."హాయిగా నవ్వేశాడు.

"మీకన్నింటికీ యెగతాళే..."

"జీవితంలో యేదీ సీరియస్‌గా తీసుకోగూడదు..." అని యింకా ఉద్రేకంగా చెప్పబోతూ జ్యోతిని చూసి చప్పున తగ్గేశాడు, సత్యం.

జ్యోతి కొంచెంసేపు మౌనంగా వుండిపోయి చివాలునలేచి లోపలికి వెళ్ళి పోయింది. సరోజిని అక్క వాలకం చూసి తానూ లోపలికి వెళ్ళింది.

"అక్కయ్యా ... నువ్వింత యిదిగా మారుతావని యెన్నడూ ఊహించనేలేదు ..." సరోజిని కొంచెం కోపంగానే అన్నది.

"జరిగినవన్నీ జరుగుతాయని అనుకొన్నామా మనం ..." జ్యోతి కూడా నిగ్రహంగానే అన్నది.

"అయితే మాత్రం నువ్వివ్వాళ మిషన్ తెప్పించుకుని కుట్టుకోవాల్సిన అవసరం వుందింటావా ..."

"నాకు యింకోరి దయా దాక్షిణ్యాలమీద బతకటం యిష్టం లేదు ..."

"అది దయా కాదు దాక్షిణ్యమూకాదు... ప్రేమానూ, నీమీదుండే అభిమానమూను—"

"మీ కట్లాగే అనిపించొచ్చు. నా మనస్సుకు సంతృప్తి వుండాలి గదా —"

"అందుకని యితరులను చులకన చెయ్యటం బాగుంటుందింటావా —"

"అందుకనే నేను మీ యింటికి రాలేదు. నువ్వెన్ని సార్లు రమ్మన్నా —"

"అంతమాత్రంచేత నువ్వు నాకు అక్కయ్యవు కాకపోతావా, నేను

నీకు చెల్లెల్ని కాకపోతానా —"

అవున్లే మాటకు మాట చెల్లించావు —"

"నేను నిన్నెప్పుడూ యెదిరించి అనలేదు — కాని యింత మూర్ఖత్వం పనికి రాదు.నువ్వేమన్నా అనుకో తర్వాత —"

పిన్నీ పిన్నీ అంటూ శారద గబ గబ లోపలికి వచ్చింది.

"ఏమిటంత హడావుడి ..."

"బాబాయి పిలుస్తున్నాడు. పాపాయికి పేరు నిశ్చయం చేశార్ట నిన్ను రమ్మన్నాడు —" అంటూనే వెళ్ళిపోయింది శారద.

"నువ్వు కూడా రా అక్కయ్యా ..."

జ్యోతి మెదలకుండా సరోజిని వెంట నడిచింది. నలుగురూ కూర్చున్నారు. ఎవరికి వారు ఆదుర్దాగా సత్యం వంక చూస్తున్నారు, ఏం పేరు నిర్ణయించాడా అని. అతను నలుగురి వంక చూశాడు.

పాపకు శేఖర్ అని పేరు పెడదాం అన్నాడు గంభీరంగా. సరోజిని గుండె ఝల్లుమంది. శేఖర్ తన కళ్ళల్లోకి వచ్చి కూర్చున్నాడు. తానూ శేఖర్ మాట్లాడుకున్న విషయాలు అతని క్షమాపణలు యింకా యెన్నెన్నో గుర్తుకొచ్చి తబ్బిబ్బయి పోతోంది. అతన్ని పూర్తిగా మరిచే పోయింది. కాని అతని పేరు పెట్టి మళ్ళీ వాటన్నింటిని యెందుకు గుర్తుచేస్తున్నాడు. సత్యం వుద్దేశం ఏమిటా అని మథనపడుతోంది. శేఖర్ మాటలు రూపురేఖలు స్ఫురణకు వచ్చి మరింత కలవర పడిపోయింది. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినాయి. కాని ఈ శుభసమయాన కంటతడి పెట్టకూడదని తమాయించుకుంది. జ్యోతి నిశ్చేష్టురాలయి వింతగా సత్యంవైపు చూసింది.

ఆనాడు సాయంత్రమే ఎంత బలవంతం చేసినా వినకుండా జ్యోతి యింటికి వెళ్ళిపోయింది శారదను తీసుకుని. సరోజిని మనస్సులో చాలా బాధపడింది. యింటికి వచ్చిన అక్కయ్యను 'మూర్ఖత్వం' అని యెందు కన్నానా అనుకుంటూ. ఆమె పట్టుదల వలన తాను కష్టపడడం కాకుండా శారద జీవితంకూడా దుర్భరం చేస్తుంది. అట్టావీలులేదు. శారద నలిబిలయి పోకూడదు. అక్కయ్య ఆత్మాభిమానం వలన శారద బలయిపోకూడదు, సరోజిని ఆవేశంగా యేదేదో అనుకుంటోంది. సత్యం కూడా విసుక్కు న్నాడు మీ అక్కయ్య పద్ధతేమీ బాగాలేదంటూ. కాని ఆయన విసుగు తాత్కాలికము. మరుక్షణం యివేవీ ఆయన మనస్సులో వుండవు. ఈవిష యం సరోజినికే పూర్తిగా తెలుసు.

## 10

జ్యోతి యింటికి వచ్చినప్పటికి ఉక్రోషం అహంకారం ఆవేశం యెక్కువయినాయి. ఇహ యెవరింటికి యెప్పుడూ కూడా వెళ్ళకూడదు అనుకుంది. ధీమాగా ఆత్మవిశ్వాసంతో అన్ని పనులూ తానే స్వయంగా చేసుకుపోవాలనే దీక్షతో వుండిపోయింది. దానివలన యింకా కష్టపడటం బాధపడటం యెక్కువయిపోయింది.

జ్యోతి కుట్టుమిషన్ చక్రం తిప్పుతూ వుంటే కాలచక్రం తిరుగుతు న్నట్టే వుంది.

ఆకులు రాలుతున్నాయి. చెట్లు మోడులవుతున్నాయి. మళ్ళీ మోడులే చిగురిస్తున్నాయి.

భూమి గుండ్రంగా తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నంత వరకూ యీ గోళంలో వున్న ప్రజలందరికీ వెలుగునీడలు తప్పవు.

తెల్లటి వెలుతుర్లో హృదయాలు వికసిస్తున్నాయి. చిక్కటి చీకట్లలో మనస్సులు కురచయిపోతున్నాయి.

ఓ కంటినుంచి ఆనందబాష్పాలు రాలుతుంటే రెండో కంటినుంచి కన్నీటిధార ప్రవహిస్తోంది.

సుఖదుఃఖాలు రెండూ గూడా ఏది ఏమిటో తెలుసుకోలేనంతగా మిశ్రమమయి మానవుణ్ణి కలవరపెడుతూ వుంటాయి. గతంనుంచి వర్తమానంలోకి వచ్చి భవిష్యత్తుకోసం నిరీక్షిస్తున్న మానవుడు గత స్మృతుల్ని సులభంగా మరుపలేకపోతున్నాడు. కాని మానవునికి మరుపుశక్తే రక్ష.

ఈనాడు జ్యోతికి గతంలో వాటిని గురించి ఆలోచించుకోవాల్సిన అవసరం యేమీలేదు. వాటిని గురించి బాధ అంతకంటే లేదు. ఇప్పుడు ఆమె చెయ్యాల్సిన పని ఒకటే; కూతురికి పెళ్ళి చెయ్యటం. కాని అదే సాధ్యం కావటంలేదు. బోలెడంత డబ్బు పోస్తేగాని సంబంధం కుదిరేటట్టు లేదు. అంతడబ్బు తాను యెక్కడినుంచి తీసుకురాగలదు. వాసు యెక్కడో ఉద్యోగం చేసుకుంటున్నాడు. సత్యానికి యీ వూరునుంచి యెప్పుడో ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. చీటికిమాటికి సరోజిని ఉత్తరాలు రాస్తూనే వుంటుంది. అయినా జ్యోతికి మొహం చెల్లటం లేదు. తనకు ఆత్మీయులెవ్వరూ లేరు. కాదు తానే ఆత్మీయులందర్నీ పోగొట్టుకున్నది అని తనలో తాను యెంతాగానో బాధపడుతూ ఉంటుంది.

శారదకు అంతా అర్థమవుతూనే వుంది. తల్లితో ఘర్షణ పడుతూ వుంటుంది. కాని ప్రయోజనం యేమీలేదు.

"అందర్నీ దూరం చేసుకుంటూ మనకు యెవ్వరూ లేరని వాపోవటం యెందుకు? అవసరం వచ్చినపుడు సహాయం చెయ్యమని అడగటం కూడా తప్పేనా — ఇంత మూర్ఖత్వం, యింత పట్టుదల పనికి రావమ్మా—" శారద కోపంగా గట్టిగానే అన్నది.

నువ్వుకూడ ఆ మాటే అంటున్నావు అని తనలో తాను అనుకున్నది జ్యోతి.

ఆ నాడు సాయంత్రం వేళ ఒంటరిగా కూర్చుని తీవ్రంగా మధన పడుతోంది శారద. ఎంతగానో తర్కించుకుంటోంది. తీవ్రంగా ఆలోచిస్తోంది. ఎన్నెన్నో ఊహలు చెలరేగుతున్నాయి మళ్ళీ మరుక్షణంలో చప్పబడిపోతుంది. అమ్మకు తెలియకుండా యింట్లోంచి వెళ్ళిపోవటమా! ఇంత పిరికిపని చెయ్యటం యెందుకు! ఈ యింట్లో యిట్లాగే కూర్చునుంటే పెళ్ళిచూపులకు వస్తూనే వుంటారు, డబ్బు దాహంతో వెళ్ళిపోతూవుంటారు. ఈ అవమానంతో క్రుంగి కృశించిపోవాల్సిందేనా! దీనికి వేరే యేదైనా ఉపాయం లేదా! నాఅంతట నేను యిల్లు విడిచి వెళ్ళిపోయినా పెళ్ళిచేసుకు రాగలుగుతానని నమ్మకం యేమిటి! ఇంకా అపనిందల పాలవటం, ఇంకా కొత్త సమస్యలు రావటం తప్ప ఉపయోగం యేమిటి: తనలో తాను తర్జనభర్జన పడుతోంది. ఉద్రేకం ఆవేశం వచ్చినంత వేగంగా ధైర్యం రావటంలేదు. ఉక్రోషం బాగా వచ్చేసింది. చివాలున లేచింది.

వాకిటి గుమ్మం దగ్గర యెవరో నిలబడ్డట్టుగా గమనించింది. కళ్ళు చిట్లించి చూస్తూ 'ఓహో కామేశ్వరరావు గారు మళ్ళీ దాపరించాడు' అనుకుంది.

వస్తూవస్తూనే ఓశుభవార్త తీసుకొచ్చాననండీ' అన్నాడు సంతృప్తిగ కామేశ్వర రావు.

'మీరెప్పుడొచ్చిన శుభవార్తల్నే తెస్తారు... కాని మాకా అదృష్టం వుండద్దూ ... పెదిమ విరిచింది జ్యోతి.

"మీరట్లా యెందుకను కుంటారు. ఈ సంబంధం అన్ని సంబంధాల మాదిరి కాదు. సంస్కారం వున్నవాళ్లు. డబ్బు మకుష్యులు మాత్రం కాదు.

పై బుధవారమే పిల్లని చూడటానికి వస్తామన్నారు..." అన్నాడు.

జ్యోతి గతుక్కుమన్నది.

"కామేశ్వరరావుగారూ మీదగ్గర దాపరికం యేముందిగాని అమ్మాయి పెళ్ళి చూపులకు యిష్టపడటంలేదు. ఇప్పటికి చూసిన వాళ్ళు చాల్లే, యింకెవ్వరికీ చెప్పవద్దని ఖచ్చితంగా అనేసింది ..."

"ఈ సంబంధం అన్నివిధాల మంచిది. కుర్రాడు మంచి ఉద్యోగం చేస్తున్నాడు. ఆస్తిపాస్తులున్నవాడు, మన సాంప్రదాయానికి అన్నివిధాల తగినవాడు. తర్వాత మీ యిష్టం ... నే వస్తా"— కామేశ్వరరావు గడప దాటాడు.

జ్యోతికి యేమీ తోచటంలేదు. కూతుర్ని ఒప్పిస్తాననే నమ్మకం పోయింది. ఆయన మరీ మరీ చెప్పివెళ్ళాడు. ఇప్పుడేం చెయ్యటమా అని తీవ్రంగా మథన పడుతోంది. శారదయితే కామేశ్వరరావు అన్నమాటలన్నీ వింటూనే ఓరగా నిలబడింది.

జ్యోతి చాలా కుంగిపోయి నిస్పృహగాను నిరాశగానూ కూతుర్ని పిలిచింది 'శారదా ఒక్కసారిటు వస్తావా' అంటూ.

"...చూడమ్మాయి ... జరిగినవేమిటో జరిగిపోయాయి ... ఇప్పుడవన్నీ తలుచుకున్నా ఉపయోగంలేదు. ఇప్పుడీ కామేశ్వరరావుగారు వచ్చి వెళ్ళారు" ... కూతురి మొహంలోకి చూసి చప్పున ఆగిపోయింది.

మళ్ళి ధైర్యాన్ని పుంజుకుని ... "ఇప్పుడో సంబంధం తెచ్చాడు. అన్ని విధాల యోగ్యమైనదట ... ... వాళ్లేమో డబ్బు మనుష్యులు మాత్రం కాదుట .... ఈ సంబంధం ఖచ్చితంగా అవుతుందని నేకూడ నమ్ముతున్నాను—నా యీ ఒక్కమాట కాదనొద్దు...ఈసంబంధంకూడా డబ్బులేని కారణంగా కుదరకపోతే మళ్ళీ నా నోటితోనేను పెళ్లిచూపులకు

రమ్మని అనను...ఈ ఒక్కసారి మాత్రం నా మాట కాదనద్దు...బతిమాలు తున్నట్లుగా ప్రాధేయపడింది.

"నీ యిష్టం" .... అన్నది ముక్తసరిగా శారద. చివాలున లేచి వెళ్ళిపోయింది.

జ్యోతి సంతోషం పట్టలేక పోయింది. ఏం రాద్ధాంతం అవుతుందో అని భయపడింది గాని అంత సుళువుగా ఒక్కమాటలో కూతురు ఒప్పుకుంటుందని కలలో కూడా అనుకోలేదు.

పెళ్ళి చూపులయిన మర్నాడే ముహూర్తం పెట్టించి వ్యవధిగా ఉత్తరం రాయండని కబురొచ్చింది. జ్యోతి తబ్బిబ్బులయి పోయింది.

"డబ్బు మాట ఏమీ అనలేదా ...." నమ్మకం కుదరక మరీ మరీ కామేశ్వరరావును అడిగింది.

"నే చెప్పటం లేదమ్మా వాళ్ళు డబ్బు మనుషులు కారని ...." కామేశ్వరరావు నొక్కి నొక్కి అన్నాడు.

అప్పటికి నమ్మకం బాగా కుదిరింది. సంబంధం వివరాలు ఊరూ పేరు అన్నీ ఇరుగు వాళ్ళకు చెపుతూ ఎంతగానో సంతోషపడుతోంది.

"ఓహో ఆ సంబంధమా, మీకందినట్టే. డబ్బు గుంజటంలో మహా ఘటికులు, ఆయన మూడో కొడుకు పెళ్ళిచేశాడుగా, మేమూ పెళ్ళాం. ఆ పెళ్ళికి, నోరు మెదిపితే డబ్బు, ఆ పిల్ల తండ్రి యెంత కుంగిపోయాడో. ఆ సంబంధానికి మీరేమి తూగగలరు" ... ఒకామె పెదిమ విరిచింది.

జ్యోతి నిశ్చేష్టురాలయి పోయింది క్షణకాలం. ఆమె మనస్సు పరి పరి విధాల పోతోంది. సూటిగా కామేశ్వరరావు గారింటికి వెళ్ళి తాను విన్నది, తన సందేహాన్ని బైట పెట్టింది. తీరా చివ్వరికి అభాసు అవుతుందా

యేమిటని తన అనుమానాన్ని వెలిబుచ్చింది.

"గిట్టని వాళ్లు అనేకం అంటూ వుంటారు. వాటన్నింటిని ఖాతరు చేస్తే యెట్లా ! ...

ఆమె మారు మాట్లాడ లేక పోయింది.

''సరేలేండి. అన్నింటికి భగవంతుని మీద భారం వెద్దాం...మనం మానవ మాత్రులం, మనచేతుల్లో యేముంది. ఎట్లా జరగాలో అట్లాగే జరుగుతుంది ... వైరాగ్యంగ అనేసింది.

పెళ్ళికి ముందుగానే వాసు కుటుంబంతో సహావచ్చేశాడు. హడావిడి చేస్తున్నాడు. 'అదెందుకు కొన్నావు, ఇదెందుకు తీసుకొచ్చావు' అంటోంది చీటికి మాటికీ జ్యోతి.

''పిన్నీ నీకేమీ కొనటంలేదు. నీకేమీ తీసుకరాపటం లేదు. నా చెల్లెలికి నేను తెస్తున్నాను" అన్నాడు వాసు ధీమాగా.

రేపు పెళ్ళి అనగా కూడా సరోజిని రాకపోయేటప్పటికి జ్యోతి విల విలలాడిపోయింది. శారద అంతకంటె బిక్కమొహం వేసుకుని కూర్చుంది.

''చిన్నపిన్నికి టెలిగ్రాం యిచ్చొచ్చా .... యింకా రాకపోవట మేమిటి ...." అన్నాడు వాసు వస్తూనే.

''అన్నయ్యా పిన్నొస్తుందంటావా" ఆదుర్దాగా అడిగింది శారద.

''పెళ్లివారొచ్చారు. అక్కడావిడ యేర్పాట్లన్నీ నే చూస్తున్నాను" అంటూ కామేశ్వరరావు వచ్చాడు.

శారద వళ్ళు గగుర్పొడిచింది.

తెల్లారినా సరోజిని రాకయేటప్పటికి జ్యోతికి చాలా ఆవేశం వచ్చేసింది. 'అవును మంచి శాస్తే చేసావు. మేము మీయింటికి రానందుకు,

అమ్మాయి పెళ్ళికి కూడా రాకుండా కూర్చున్నావు. అక్కయ్య మీద బాగానే కసి తీర్చుకున్నావు. పాపం శారద యేం చేసింది. దాని మొహం చూసైనా రావల్సింది... పిన్నీ పిన్నీ అంటూ యెంత యిదవుతోంది...' జ్యోతి అక్కసు పడుతోంది. తుడుచుకుంటున్న కొద్దీ కళ్ళ నీళ్ళు వస్తూనే వున్నాయి.

వాసూ శ్యామలా పీటలమీద కూర్చున్నారు. శారది పెళ్ళికూతుర యింది.

ఆ క్షణంలో జ్యోతి మనస్సు ఆవేదన ఆరాటం ఆలోచన అంతా కూడా యీ ముహూర్తం సలక్షణంగా జరిగిపోవాలనేదే.

శారద సిగ్గుబరువుతో పెళ్ళిపీటలమీద తల వంచుకున్నప్పటికీ కళ్లు పైకెత్తి అటూ యిటూ సరోజిని పిన్నికోసం గాలిస్తూనేవుంది.

జ్యోతి కొంచెం యెడంలో కళ్ళు నిలిపి కూతుర్ని చూస్తోంది. ఆమె వెనకాలే కూర్చున్న వాళ్ళ మాటలు అక్కడకు కూడ వినిపిస్తున్నాయి.

"... ఈ మగపెళ్లివారు మహ అసాధ్యులు ... డబ్బు పెట్టందే ముందుకు సాగరు ... పెళ్లికూతురి పింతల్లి వుందిట సరోజినట ... ఈ డబ్బంతా ఆ సరోజినే పెట్టిందట... లేకపోతే ఓ పట్టావ యీ సంబంధం ఒప్పుకునే వాళ్లేనా ... పెళ్ళి కూతురు వాడికి యేముందని ..."

"అసలు యీ కామేశ్వరరావుగార్కి అంతా తెలుసు, జ్యోతికి చెప్పకుండా దాచి వుంచాడు ..."

జ్యోతి నివ్వెరపోయి చప్పున వెనక్కు తిరిగింది.

"ముహూర్తం సైమయింది... "భజంత్రీలు" .... పురోహితుడు పెద్దగా మంత్రాలు చదువుతున్నాడు.

జ్యోతి అక్షింతలు చేతిలోకి తీసుకుని ఓ అడుగు ముందుకు వేసిందో లేదో మగపెళ్ళివారిలోంచి సరోజిని, సత్యం యిద్దరూ గభాలున వచ్చేసి పెళ్ళికొడుకు, పెళ్ళికూతురుల మీద అక్షింతలు వేశారు. శారద చెక్కిళ్ళను నొక్కుతూ గడ్డం క్రింద చెయ్యి పెట్టి తల కొంచెం పైకెత్తింది.

శారద బిడియంగ తలపై కెత్తేటప్పటికి సరోజిని కనిపించింది.

'పిన్నీ ! ....' ఎంతో ఉద్వేగంగా అన్నది. పెళ్లికూతురు బొబాయి అంటూ మనస్సులోనే పొంగిపోయింది.

జ్యోతి యిదంతా చూస్తూ కొయ్యబారి పోయినట్లు నిలబడి పోయింది.

"అక్కా ! ... నన్ను క్షమించు... శారదంటే నాకెంత ప్రేమో నీకు తెలీదు .... గద్గదంగా అంటూ గొంతును సవరించుకుంది సరోజిని.

"నాకు అన్నీ తెలిసినాయి ... నువ్వు మానవ మాత్రురాలివి కాదమ్మా ... దేవతవి, దేవతవి ..." ఆయాసపడుతూ సరోజినిని చుట్టేసింది జ్యోతి.

